ప్రజాశక్తి

శనివారం 21 అక్టోబర్ 2023 | 8 పేజీలు

గుంటూరు | పల్నాడు

యుటిఎఫ్ దీక్షలు భగ్నం

- నాయకులను ఆసుపత్రికి తరలించిన పోలీసులు
- దీక్షలకు సిపిఎం, పలు సంఘాలు మద్దతు

నిరవధిక దీక్షా శిబిరంలోని నాయకులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

యుటిఎఫ్ జిల్లా అధ్యక్షురాలు ఆదిలక్ష్మిని అరెస్ట్ చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-గుంటూరు

కాంట్రిబ్యూషనరీ పెన్షన్ విధానం (సిపిఎస్) రద్దు, పాత పెన్షన్ విధానం (ఒపిఎస్) సాధనకు యుటిఎఫ్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా గుంటూరు కలెక్టరేట్ వద్ద చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలను పోలీసులు శుక్రవారం భగ్నం చేశారు. దీక్షలను అడ్డుకోవటానికి పోలీసులు రెండోరోజు దీక్షా శిబిరం వద్ద హైడ్రామా సృష్టించారు. నిరవధిక దీక్షలకు అనుమతి లేదంటూ ప్రభుత్వ వైద్యుల్ని రప్పించి, దీక్షాపరులకు వైద్య పరీక్షలు చేయించారు. తాము బాగానే ఉన్నామని నాయకులు చెప్పినా వినకుండా దీక్షల్లో ఉన్న ఏడుగురు నాయకుల్ని పోలీసులు బలవంతంగా వాహనాల్లో ఎక్కించి, గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు తరలించారు. పరీక్షల అనంతరం పంపించేశారు. దీక్షలకు సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర నాయకులు ఎం.హరిప్రసాద్, సిపిఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు రత్తయ్య, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు ఎస్.కె.బాషా, యుటిఎఫ్ సీనియర్ నాయకులు జోజయ్య,

దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు

▶ 2లో

కౌలు సొమ్ము కోసం నిరీక్షణ

- ఆందోళన బాటలో రాజధాని రైతులు
- త్వరలో సిఆర్‌డిఎ కార్యాలయం ముట్టడికి సన్నాహాలు
- కోర్టులో పిటీషన్, పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

నిర్ణీత సమయానికి కౌలు ఇవ్వకపోవడంతో రాజధాని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మేలో కౌలు ఇస్తున్నట్టు ఉత్తర్వులిచ్చినా ఇప్పటి వరకు అమలుకు నోచలేదు. 29 గ్రామాల పరిధిలో 22,948 మంది రైతులకు 28,128 ఎకరాల భూమికి రూ.183.17 కోట్లు కౌలు పరిహారం విడుదల చేస్తూ మేలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మీ ఉత్తర్వులు జారీ చేశారు. రైతుల నుంచి 33 వేల ఎకరాల భూమిని సిఆర్‌డిఎ 2015 జనవరి నుంచి డిసెంబరు వరకు భూ సమీకరణ ద్వారా రాజధాని నిర్మాణం నిమిత్తం తీసుకుంది. 2016 నుంచి కౌలు చెల్లింపులు ప్రారంభించింది. వార్షిక కౌలు

కౌలుకోసం తుళ్లూరు పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నాలో రైతులు, మహిళలు

▶ 2లో

1వ తేదీ నుండి పత్తి కొనుగోళ్లు 2లో

మణికంఠ, నవీన్ కుమార్ మతదేహాలు, ఇన్‌సెట్‌లో మృతులు మణికంఠ, నవీన్ కుమార్ (ఫైల్‌ఫొటోలు). బిడ్డల మృతదేహాల వద్ద విలపిస్తున్న తల్లి కోటేశ్వరమ్మ

వార్త మెయిన్‌లో

నీటి గుంతలో పడి అన్నదమ్ములు మృతి

ప్రజల్ని విస్మరించిన ప్రభుత్వాలు

- ఆర్థిక భారంతో కూలీలు సతమతం
- సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్
- సత్తెనపల్లి మండలంలో కొనసాగిన సిపిఎం పోరుయాత్ర

మాట్లాడుతున్న విజయ్‌కుమార్

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

అదాని, అంబాని ప్రయోజనాలు మినహా దేశ ప్రయోజనాలు, ప్రజల కష్టాలు ప్రధాని నరేంద్ర మోడీకి పట్టడం లేదని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్

▶ 2లో

వసంత రాజకీయం పద్య నాటకంలో సన్నివేశం

వార్త మెయిన్‌లో

వీణా అవార్డ్స్ నాటక పోటీలు ప్రారంభం

తారక రామారావుకు ఎఆర్ కృష్ణ జాతీయ పురస్కారం ప్రదానం

మిర్చి పొలంలో రైతు కన్నీరు

- ఒక్క తడి నీటి కోసం రూ.30 వేల వరకూ ఖర్చు
- మరో 10 రోజుల్లోగా వానల్లేకుంటే ఆశలు వదులుకోవడమే

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

సాధారణంగా అక్టోబర్‌లో వర్షాలు కురిసి పైరుతో పొలాలు కళకళలాడతాయి. ముమ్మర వ్యవసాయ పనులలో రైతులు, కూలీలు క్షణం తీరిక లేకుండా గడుపుతారు. కానీ ఈసారి పరిస్థితి తారుమారైంది. వర్షాభావంతో పొలంలోని మొక్కలను బతికించుకోవడానికి రైతులు నానా అవస్థ పడుతున్నారు. అనేక వ్యయ ప్రయాసలకోర్చి నీటిని అందిస్తున్నారు. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని ప్రభుత్వ సిబ్బంది డబ్బులు గుంజుతున్నారు.

నరసరావుపేట మండలంలో 35 వేల ఎకరాల సాగు భూమి ఉండగా గతేడాది 3400 ఎకరాల్లో మిర్చి సాగైంది. ఈ ఏడాది వర్షాభావం దృష్ట్యా 1500 ఎకరాలకే పరిమితమైంది. పైరు ప్రస్తుతం 60-80 రోజుల దశలో ఉంది. ఇప్పటికే కొన్ని పొలాల్లో పూత రాగా ఇతర

ట్యాంకర్ ద్వారా మిర్చికి నీరు పెడుతున్న రైతులు

▶ 2లో

ఐదు ఇసుక రీచ్‌లకు అనుమతులు 8లో

యుటిఎఫ్ దీక్షలు భగ్నం

(మొదటి పేజీ తరువాయి)

దుర్గారావు, వినోద తదితరులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. పాశం రామారావు దీక్షలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వాలు ప్రపంచ బ్యాంకు సంస్కరణల్లో భాగంగా, ప్రభుత్వ రంగాన్ని బలహీన పరచటానికి ఉద్యోగుల పెన్షన్‌ను నిర్వీర్యం చేస్తోందన్నారు. తాత్కాలిక ఉద్యోగుల నియామకాలు, ఇటీవల కేంద్రం తెచ్చిన అగ్నిపథ్ వంటివి ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసే కుట్రలో భాగమనేనన్నారు. దాదాపు 30 ఏళ్లపాటు ప్రభుత్వ సేవలు అందించిన ఉద్యోగులకు రిటైర్మెంట్ తర్వాత జీవితానికి భద్రత లేకపోవటం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో పాదయాత్ర సందర్భంగా సిపిఎస్ రద్దు చేస్తామని ఇచ్చిన హామీని విస్మరించిందని విమర్శించారు. ప్రభుత్వం పునరాలోచించి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంత నిర్బంధం ప్రయోగించినా సిపిఎస్ ఉద్యమాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. ఒపిఎస్ సాధించుకునేంత వరకూ పోరాటం కొనసాగుతుందన్నారు. అనేక రాష్ట్రాల్లో సిపిఎస్ రద్దు చేశారని, అక్కడ లేని సమస్య ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే ఎందుకు వస్తుందని ప్రశ్నించారు. కార్పొరేట్ల లాభాల కోసమే సిపిఎస్ కొనసాగిస్తున్నాయన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ నాలుగున్నరేళ్లపాటు ప్రభుత్వం సిపిఎస్ రద్దు హామీని తొక్కిపెట్టి, ఇప్పుడు ఉద్యోగుల ఆమోదం లేకపోయినా జిపిఎస్‌ను తెరపైకి తెచ్చిందన్నారు. సిపిఎస్, జిపిఎస్ రెండూ ఒకటేనని, సిపిఎస్ కంటే జిపిఎస్ ఇంకా ప్రమాదకరమని చెప్పారు. పాత పెన్షన్ విధానం తప్ప, సిపిఎస్, జిపిఎస్‌ను అంగీకరించబోమని ఉద్ఘాటించారు. దీక్షల్లో కూర్చున్న వారిలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతోపాటు జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, ఎఎల్. శివపార్వతి, జిల్లా కార్యదర్శులు సిహెచ్.ఆదినారాయణ, ఎమ్‌డి.షకీలాబేగం, జి.వెంకటేశ్వరరావు ఉన్నారు.

దీక్షలను భగ్నం చేయటంపై సిపిఎం ఖండన

దీక్షను పోలీసులు భగ్నం చేయటాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు ఒక ప్రకటనలో ఖండించారు. ఒపిఎస్ సాధనకు దశల వారీగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవటంతో ఉపాధ్యాయ నాయకులు రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక దీక్షకు పూనుకున్నారని, పోలీసులు దీక్షా శిబిరంలోఉపాధ్యాయ నాయకుల్ని బలవంతంగా ఆస్పత్రికి తరలించారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ప్రజల్ని విస్మరించిన ప్రభుత్వాలు

(మొదటి పేజీ తరువాయి)

విమర్శించారు. మండలంలో సిపిఎం చేపట్టిన పోరుయాత్ర శుక్రవారం కంకణాలపల్లి, దూళిపాళ్ల, భీమవరం, పాకాలపాడు, అబ్బూరు గ్రామాల్లో సాగింది. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు, పన్నుల భారాలపై ప్రజలంతా ఐక్యంగా పోరాడాలన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగం కరువై నిరుద్యోగులుగా, వ్యవసాయ కూలీలుగా మారుతున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నష్టదాయకమైన విధానాలనే రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం అమలు చేస్తోందని విమర్శించారు. పైర్లు ఎండిపోయి రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నా కనీసం స్పందించడం లేదని, వ్యవసాయ కూలీలకు పనుల్లేక ఆర్థిక భారంతో సతమతమవుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. సమస్యలకు నిలయాలుగా గ్రామాలున్నాయన్నారు. ఈ నేపథ్యంలో రైతులు, కూలీలు, అసంఘటిత రంగ కార్మికులకు అండగా సిపిఎం పోరాడుతుందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ మాట్లాడుతూ గ్రామాల్లో పనుల్లేక జనం పస్తులుంటున్నారని, రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర వస్తువులను పేదలకు ఉచితంగా అందించాలని కోరారు. తక్షణమే కరువు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. సిపిఎం మండల కార్యదర్శి పి.మహేష్ మాట్లాడుతూ పోరాయాత్ర దృష్టికి ప్రజలు అనేక సమస్యలను తెస్తున్నారని, వాటిని ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్తామని, పరిష్కరించకుంటే పోరాడతామని చెప్పారు. కార్యక్రమంలో భగత్, పూర్ణచంద్రరావు, తులసీరామ్, లక్ష్మి, తాతారావు, అమూల్య, సుజాత, సత్యవతి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

1వ తేదీ నుండి పత్తి కొనుగోళ్లు

ఏర్పాట్లపై సమీక్షించిన జెసి రాజకుమారి

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో 2023-24 సీజన్‌కు సంబంధించి పత్తి కొనుగోళ్లపై మార్కెటింగ్, వ్యవసాయ శాఖ, పోలీసు, అగ్నిమాపక శాఖ, ట్రాన్స్‌పోర్ట్ శాఖ అధికారులతో జెసి రాజకుమారి శుక్రవారం సమీక్షించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షలో జెసి మాట్లాడుతూ జిల్లాలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ఆధ్వర్యంలో 10 జిన్నింగ్ మిల్లులు, 4 మార్కెట్ యార్డులను పత్తి కొనుగోలు కేంద్రాలుగా గుర్తించామన్నారు. గుంటూరు మార్కెట్ యార్డు పరిధిలో 3, తాడికొండ పరిధిలో 2, ఫిరంగిపురం పరిధిలో 1, ప్రత్తిపాడు పరిధిలో 4 జిన్నింగ్ మిల్లులను గుర్తించి ప్రత్తి కొనుగోలు కేంద్రాలుగా గుర్తించారని వివరించారు. పత్తిరైతులంతా తమ పేర్లను తమ దగ్గరలోని ఏదైనా రైతు భరోసా కేంద్రంలో నవంబర్ 1 నుండి నమోదు చేయించుకొని, దగ్గరలోని ఏదైనా జిన్నింగ్ మిల్లులకు తీసుకువెళ్లి క్వింటాళ్ కనీస ధర రూ.7020కు విక్రయించుకోవచ్చని చెప్పారు. రైతులెవ్వరూ మధ్యవర్తులు/దళారుల వద్దకు వెళ్ళకుండా తమ నాణ్యమైన పత్తిని గుర్తించిన చేసిన జిన్నింగ్ మిల్లులలో కనీస మద్దతు ధరకు అమ్ముకొవచ్చన్నారు. గుర్తించిన జిన్నింగ్ మిల్లులు మార్కెట్ యార్డుల వద్దకు ఎవరైనా మధ్యవర్తులుగానీ, దళారులుగానీ వస్తే వారిపై చట్ట పరమైన క్రిమినల్ కేసులు నమోదు చేయబడతాయి హెచ్చరించారు. సమావేశంలో సహాయ మార్కెటింగ్ సంచాలకులు బి.రాజబాబు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, సిసిఐ బయ్యర్లు ఉదయ్ ఆర్.షా, పి.నాగేశ్వరరావు, ఎం.ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

సమీక్షలో మాట్లాడుతున్న జెసి రాజకుమారి

మిర్చి పొలంలో రైతు కన్నీరు

నీటి సరఫరాకు ఏర్పాటు చేసిన పైపులు.. మిర్చి తోటకు సరఫరా అవుతున్న నీరు

(మొదటి పేజీ తరువాయి)

పొలాల్లోనూ మరో నెలలో వస్తుంది. ఈ దశలో పైరుకు నీరు పెట్టకుంటే బెట్టకు రావడంతోపాటు తెగుళ్లు, పురుగులు ఆశిస్తాయి. పూత మొత్తం రాలిపోతుంది. మరో 10 రోజుల్లో వర్షాలు రాకున్నా, మొక్కకు ఎలాగోలా నీరు అందించకున్నా ఆశలు వదులుకోవడమేనని రైతులు చెబుతున్నారు.

అప్పులు చేసి, నానా కష్టాలు పడి సాగు చేసిన పైరును చూస్తూచూస్తూ వదిలేసుకోలేక రైతులు ఆవేదనకు గురవుతున్నారు. మొక్కలకు నీరు పెట్టుకోవడానికి నానా అగచాట్లు పడుతున్నారు. వర్షాలు లేకపోవడం, కాల్వలకు నీరు రాని నేపథ్యంలో ట్యాంకర్ల ద్వారా నీటిని అందించేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. ఒక ఎకరాకు మోస్తరు తడి ఇవ్వాలంటే కనీసం 30 ట్యాంకర్ల వరకు అవసరం. మండలంలోని ములకలూరులో చెరువు (తాగు నీటి అవసరాలకు ఉపయోగించడం లేదు)కు వాగులు, కాల్వల ద్వారా నీరు వస్తుంది. దీన్ని పశువులు, ఇతర గ్రామ అవసరాల కోసం ఉపయోగిస్తుంటారు. ఈ చెరువు నుండి నీటిని పొలాలకు ట్యాంకర్ల ద్వారా తరలించి మొక్కలకు పెడుతున్నారు. ఒక్క ట్యాంకర్ నీటిని తరలించడానికి సొంత వాహనం ఉన్న వారికే రూ.800 వరకూ ఖర్చవుతున్నాయి. ఎకరాకు 30 ట్యాంకర్లన్నా అవసరం కాబట్టి రైతు రూ.30 వేల వరకూ అదనపు భారాన్ని భరించాల్సి వస్తోంది. ఈ అవకాశం లేని గ్రామాల్లో రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. దీనికితోడు దిగుబడులను తీవ్రంగా దెబ్బతీసే బొబ్బర తెగుళ్లు కూడా ఆశిస్తున్నాయి. నివారణ కోసం రైతులు మందులు పిచికారీ చేస్తున్నారు.

లంచం కోసం చందాలు

కలిశెట్టి చిన్నా, కౌలురైతు, కేతిముక్కల అగ్రహారం

ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని ప్రభుత్వం చెప్పడంతో ముందస్తుగా ఎకరాకు రూ.15 వేలు కౌలు చెల్లించి మూడెకరాల్లో మిర్చి వేశాను. నీటి ఎద్దడి రావడంతో ఏం చేయాలో పాలుపోలేదు. ఇటీవల కాల్వలకు విడుదల చేసిన నీటితో ఒక తడైనా పొలాలకు పెడదామని కాల్వ తూము వద్దకు వెళ్తే లస్కర్ రూ.10 వేలు అడిగారు. రైతులందరం చండాలేసుకుని ఆ డబ్బులిచ్చాం. అయినా నీరు పొలం వరకు వచ్చినా పొలంలోకి రాలేదు. దీంతో ట్యాంకర్ ద్వారా పెట్టుకుంటున్నాం.

అరెకరానికే రూ.45 వేలు ఖర్చు

గడ్డిపర్తి ఏసుబాబు, రైతు, కె.ఎం.అగ్రహారం.

నాకున్న అరెకరంలో మిర్చి సాగు చేస్తే ఇప్పటికే రూ.45 వేల వరకు ఖర్చయింది. పొలానికి నీరందక ఆకు ముడత పడుతోంది. పంటపై ఆశలు సన్నగిల్లాయి. మా పక్క పొలాల రైతులందరం కలిసి రూ.లక్ష వరకు చందాలేసుకుని 2 కిలోమీటర్ల పైపులు కొనుగోలు చేసి చెరువు నీటిని పెట్టుకుంటున్నాం. అయినా ఈ నీరు కూడా చాలడం లేదు. ప్రభుత్వమే మమ్మల్ని ఆదుకోవాలి.

కౌలు సొమ్ము కోసం నిరీక్షణ

(మొదటి పేజీ తరువాయి)

అందచేయడంలో గత మూడేళ్లుగా తీవ్ర జాప్యం జరుగుతోంది.

2016 నుంచి 2019 వరకు ప్రతి ఏటా ఏప్రిల్ నుంచి మే చివరి లోగా వార్షిక కౌలు సొమ్ము రైతుల ఖాతాల్లో జమయ్యేది. వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత 2020 నుంచి ప్రతి ఏటా జూన్ నుంచి ఆగస్టులోగా జమ చేస్తూ వచ్చారు. ఈ ఏడాది మేలోనే ఉత్తర్వులు ఇచ్చినా ఇంత వరకు రైతుల ఖాతాల్లో వార్షిక కౌలు జమకాలేదు. అయితే ఎవరైతే తమకు కౌలు సొమ్ము రాలేదని కోర్టును ఆశ్రయిస్తారో వారికి మాత్రమే కౌలు చెల్లింపులు జరుగుతున్నాయి. దీంతో మొత్తం రైతుల తరుపున ఇటీవల హైకోర్టులో పిటీషన్లు దాఖలయ్యాయి. ఈ పిటీషన్లను దసరా తరువాత విచారిస్తామని కోర్టు వాయిదా వేసింది. ఈలోగా సిఆర్‌డిఎ అధికారులను కౌంటర్‌దాఖలు చేయాలని కోరింది.

సిఆర్‌డిఎకు భూములు అప్పగించిన రైతులకు 10 ఏళ్లపాటు ఏటా 10 శాతం పెంచేలా అప్పటి టిడిపి ప్రభుత్వం రాజధాని రైతులకు కౌలు సాయం ప్రకటించింది. మెట్ట భూములకు ఎకరాకు రూ.30 వేలు, మూడు పంటలు పండే జరీబు భూముల రైతులకు ఎకరాకు రూ.50 వేలు కౌలు అప్పటి టిడిపి ప్రభుత్వం నిర్ధారించింది. ఈ మొత్తంపై ప్రతిఏటా 10 శాతం సొమ్ము పెంచి రైతుల ఖాతాల్లో జమ అయ్యేలా గత ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ విధానాన్ని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగిస్తున్నా చెల్లింపుల్లో తీవ్ర జాప్యం చేస్తుంది. 2021 నుంచి ప్రతి ఏటా కోర్టులో పిటీషన్ దాఖలు చేసిన తరువాతనే రైతులకు కౌలుసాయం అందిస్తున్నారు. రెండేళ్లుగా అసైన్డ్ రైతులకు కూడా కౌలు పరిహారం నిలిచిపోయింది.

29 గ్రామాల్లో 3 వేల మంది అసైన్డ్ రైతులు ఉన్నారు. వీరి భూములు కూడా రాజధానికి తీసుకున్నారు. అయితే అసైన్డ్ భూముల అప్పగింతలో అక్రమాలు జరిగాయని సిఐడి అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ దర్యాప్తు పెండింగ్‌లో ఉండటం వల్ల అసైన్డ్ రైతులకు కౌలు పరిహారం నిలిపివేశారు. వీరి తరుపున సిపిఎం ఆధ్వర్యంలో పలుమార్లు ఆందోళనలు నిర్వహించారు. ప్రభుత్వం కౌలు సొమ్ము సిఎఫ్ఎంఎస్‌కు పంపినా బ్యాంకు ఖాతాలకు జమకావడంలో జాప్యంపై రైతులు ఆగ్రహంగా ఉన్నారు. ప్రభుత్వం కావాలని జాప్యం చేస్తోందని, తమను నిర్లక్ష్యం చేస్తుందని రాజధాని రైతులు శుక్రవారం తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మునిసిపల్ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మీపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

వచ్చేనెల 26న అంబేద్కర్ విగ్రహం ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ

స్థానిక స్వరాజ్ మైదానంలో నిర్మాణంలో ఉన్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహ స్మృతి వనం నిర్మాణ పనులను శుక్రవారం రాష్ట్ర మున్సిపల్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై శ్రీలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో కలిసి పరిశీలించారు. అంబేద్కర్ విగ్రహం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోనున్నదన్నారు. ప్రతిరోజూ దాదాపుగా 500 మంది పైగా కార్మికులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహం స్మృతి వనం పనులను చేస్తున్నారన్నారు.రూ. 400 కోట్లతో నిర్మించే అతిపెద్ద విగ్రహ నిర్మాణ పనులు పూర్తయ్యాయన్నారు. పిడబ్ల్యుడి గ్రౌండ్స్ చుట్టూ ఉన్న ప్రదేశాలను, ఫుట్‌పాత్‌లను మరింత అందంగా బ్యూటిఫికేషన్ చేయాలనీ సంబంధిత అధికారులకు పలు ఆదేశించామన్నారు. ప్రహరీ, లైటింగ్, గ్రానైట్, పాత్వే, వాటర్ ఫౌంటైన్, వెహికల్ పార్కింగ్, ఎలక్ట్రిసిటీ, ల్యాండ్ స్కేపింగ్, గ్రీనరీ, సుందరీకరణ తదితర పనులు వేగంగా సాగుతున్నాయన్నారు.

యువకుడు అదృశ్యం

ప్రజాశక్తి - గుంటూరు సిటి

లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో యువకుడు అదృశ్యం పై కేసు నమోదు చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. సిఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం నల్లచెరువు 14 వ లైన్‌లో నివసించే షేక్ మహమ్మద్ రఫీ(37) భారత్ కేఫ్ లో మేనేజర్ గా పనిచేస్తున్నాడు. ఈ నెల 15వ తేదీ సాయంత్రం నుండి కనిపించడం లేదు. మహమ్మద్ ఆచూకీ కోస అతని కుటుంబసభ్యులు వెతికినా ఫలితం లేదు. దీంతో, అతని భార్య మహబూబ్ జాని ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు లాలాపేట పోలీసులు తెలిపారు. సుమారు 5 అడుగులు ఎత్తు, తెలుపు రంగులో ఉంటాడని, అతని ఆచూకీ తెలిసినవారు 86888831311, 08632221 261 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పండ్లు పంపిణీ చేస్తున్న మాస్ అధ్యక్షులు నాగరాజు

సామాజిక రుగ్మతలపై నిరంతరం పోరాటం

ప్రజాశక్తి-తెనాలి

మాదిగ అసోసియేట్ సోషల్ సర్వీసెస్(మాస్) మొదటి వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సుద్దపల్లి నాగరాజు ఆధ్వర్యంలో తెనాలి జిల్లా వైద్యశాల తల్లి బిడ్డల విభాగంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ సంస్థ ప్రారంభించి ఏడాది పూర్త యింద న్నారు. సంస్థ లక్ష్యాలకు అనుగుణంగా సామాజిక రుగ్మ తలపై నిరంతరం పోరాటం సాగుతుందన్నారు. సభ్యులు సహకారంతో భవిష్యత్ లో సేవాకార్యక్రమాలు విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులతో పాటు వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

యువకులకు ఎస్సై కౌన్సెలింగ్

ప్రజాశక్తి-తెనాలి

బహిరంగంగా మద్యం సేవిస్తూ ప్రజలకు అసౌకర్యం కలిగిస్తున్న మందుబాబులకు రూరల్ ఎస్సై సిహెచ్ వెంకటేశ్వర్లు కౌన్సెలింగ్ నిర్వహించారు. రూరల్ గ్రామం పెదరావూరు శివారు సుగాలి తండాలో కొంత మంది యువ కులు మద్యం సేవిస్తున్నారు పెట్రోలింగ్ లో భాగంగా వారిని గమనించిన ఎస్ఐ కౌన్సిలింగ్ నిర్వహించారు. వారిపై కేసు నమోదు చేశారు.

రజకులపై దాడి దారుణం : జూపూడి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

హిందూపురంలో రజకులు గుడిలో పూజలు చేస్తుండగా అగ్రకులాల వారు దాడి చేయడం హేయమని రాష్ట్ర రజక జనసేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు రాష్ట్రంలో రజకులపై దాడులు పెరిగిపోతున్నాయని, శాంతి భద్రతలను కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ గెలిచిన సర్పంచ్ మంజునాథ్ తన అనుచరులతో దాడి చేయడం దుర్మార్గపు చర్య అని, సర్పంచ్‌ని, అనుచరులను వెంటనే అరెస్ట్ చేయాలని జూపూడి శ్రీనివాసరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మునిపల్లెలో 'ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

మండలంలోని మునిపల్లెలో శుక్రవారం నిర్వహించిన జగ నన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో ప్రజలు భారీగా పాలఈ కార్య క్రమానికి ఎంపీడీవో శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. కార్య్ర కమంలో సర్పంచ్ కూచిపూడి స్వరూపారాణి, ఎంపీటీసీ వేల్పూరి వెంకటేశ్వరమ్మ శంకర్,వైసిపి రూరల్ అధ్యక్షులు రుద్ర పాటి ఆదిశేషులు, బిసి నాయకులు దాసరి శివరామకృష్ణ పాల్గొన్నారు.

నిలిచిపోయిన చెత్త ఆటోలు

ప్రజాశక్తి-తాడేపల్లి

తాడేపల్లి పట్టణంలో చెత్తను తరలించే ఆటోలకు సంబంధిత కాంట్రాక్టర్లు సకాలంలో జీతాలు చెల్లించక పోవడంతో శుక్రవారం ఉదయం నుంచి ఎక్కడికక్కడ ఆటోలను నిలిపివేసి డ్రైవర్లు తమ నిరసన తెలిపారు. వెంటనే తమకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉదయం నుంచి ఎక్కడికక్కడ ఆటోలు నిలిచిపోవడంతో చెత్త ఎక్కడికక్కడ దర్శనమిస్తుంది. తమ డిమాండ్లు పరిష్కరించే వరకు విధులు బహిష్కరిస్తామని డ్రైవర్లు చెబుతున్నారు.

కెవిపిఎస్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అలాగే రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వం దళిత ప్రజా వ్యతిరేక విధా నాలు అవలంబిస్తూ పరిపాలన చేస్తున్నాయని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షులు సిహెచ్.రాజేష్ అన్నారు. ప్రభుత్వాల తీరుకు నిరసనగా కెవిపిఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి రెండోసారి అధికారం లోకి వచ్చిన తర్వాత సబ్ ప్లాన్ చట్టాన్ని తిలోదకాలిచ్చి ఎస్సీ ఎస్టీ బ్యాక్లాగ్ పోస్టులు ఎక్కడ భర్తీ చేయట్లేదని, ప్రభుత్వ రంగాన్ని మొత్తం ప్రైవేటు వ్యక్తులకు కట్టబడుతుందన్నారు. లౌకిక రాజ్యాంగానికి ప్రమాదం ఏర్పడిందని దేశవ్యాప్తంగా దళితులపై దాడులు తీవ్రతరమైన మరియు ముఖ్యంగా బిజెపి పాలిత రాష్ట్రాల తర్వాత మన రాష్ట్రం ఉండటం ఆందోళన కలిగించే అంశం అన్నారు. దళితులకు భూ పంపిణీ చేయాల్సిన న భూ చట్టాలను 9/77 అసైన్డ్ చట్టాలను కాలరాశి దళితులకు భూమి లేకుండా చేస్తున్నరన్నారు. భూస్వాములు ఆక్రమంలో ఉన్న భూమిని తీసుకుని ప్రజలకు పంచాలని అసైన్డ్ కట్ట సవరణ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి రెండు లక్షల కోట్లు కేటాయించాలని,ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలు ఏర్పాటు చేయాలని దానిలో దళిత సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలనిరాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ దాడులు హత్యలు స్త్రీల అత్యాచార్యుల కేసులను విచారించడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్ర మంలో జిల్లా కమిటీ సభ్యులు బుర్రె రాజు, పట్టణ కెవిపిఎస్ అధ్యక్షులు మిర్యాల ఆనంద్ బెనర్జీ, పట్టణ కమిటీ సభ్యులు శరత్ బాబు ,సిఐటియు పట్టణ కార్యదర్శి సిహెచ్ జయ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు తప్పని ట్రాఫిక్ కష్టాలు

ప్రజాశక్తి-విజయవాడ : కృష్ణలంక పరిధిలో ప్రతి ఐదు నిమిషాలకు ట్రాఫిక్ స్తంభిస్తుంది. దీంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. శుక్రవారం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పట్టు వస్త్రాలు సమర్పించడానికి మధ్యాహ్నం 3.40 గంటలకు ఇంద్రకీలాద్రిపైకి చేరుకున్నారు. ఈ పేరుతో ఉదయం నుంచే ప్రధాన రహదారిపై ట్రాఫిక్ నియంత్రణ పేరుతో ఆంక్షలు విధించారు. దీంతో ఆయా ప్రధాన జంక్షన్ల వద్ద ట్రాఫిక్ నిలిచిపోయి స్థానిక ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురయ్యారు. ఈ ఐదారు రోజుల నుంచి ప్రధాన రహదారిపై ఏ నిమిషం ఎక్కడ వాహనాలు ఆగుతాయోననే ఆందోళనను స్థానిక నివాసులతో పాటు వాహన దారుల్లో నెలకొంది. నగర పరిధిలో వారధి దగ్గర నుంచి గుంటూరు బస్‌లు ఆగే ప్రదేశం, సత్యం హోటల్, పోలీసు స్టేషన్ సెంటర్, బస్‌స్టాండ్ ఎదురు ప్రధాన కూడలి, రైల్వే అండర్ బ్రిడ్జి, రాజీవ్‌గాంధీపార్కు, ఫ్లైఓవర్ దిగువన టెంపుల్ ఏరియా, కుమ్మరిపాలెం సెంటర్, స్వాతి థియేటర్ తదితర ఏరియాల్లో ప్రధాన రహదారిపై ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోతుంది. ఫ్లైఓవర్ దిగువన (రాజీవ్‌గాంధీపార్కు సమీప- కృష్ణవేణి ఘాట్‌వైపు) శనీశ్వరాలయం వైపు, విఎంసి వైపు వెళ్లే పాదచారులను, దేవస్థానం పాస్‌లున్న వారి వాహనాలను మాత్రమే పోలీసులు అనుమతిస్తున్నందున, ఈ పాయింట్‌లో కూడా రహదారిపై ట్రాఫిక్ నిలిచిపోతోంది.

మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 14,480
మిర్చి ఎగుమతి	: 15,661
మిర్చి నిల్వ	: 7,040

మిర్చి ధరలు

	రూపాయలలో
334	12,000 - 23,000
నెం.5	10,000 - 21,000
273	19,000 - 20,000
341	10,000 - 22,000
	నాన్ ఎసి
తేజ	10,000 - 24,000
బడిగి	11,500 - 26,000
దేవనూరు డీలక్స్	14,700 - 21,500
తాలుకాయలు	6,000 -14,500
	ఎసి
334	18,500 - 23,500
నెం.5	20,000 - 20,000
273	17,000 - 17,000
341	14,500 - 20,000
4884	16,500 - 16,500
తేజ	10,000 - 23,400
బడిగి	16,000 - 25,000
దేవనూరు డీలక్స్	18,000 - 20,000
తాలుకాయలు	6,000 -12,500

ప్రకటన

మా క్లయింట్స్ పల్నాడుజిల్లా, వినుకొండ పట్టణ కాపురస్తులు (1) కాకుమాను వెంకయ్య గారి దత్తు కుమారుడు వెంకట రాధాకృష్ణమూర్తి (2) మేదరమెట్ల బాల గురవయ్య గారి కుమారుడు ఆంజనేయులు గారు, అందించిన సమాచారము ప్రకారం యావన్మందికి తెలియజేయునది ఏమనగా,

నా క్లయింట్స్ వినుకొండ మునిసిపల్ పరిధిలో సర్వే నెం.181-3-1లో 455.34 చ. గల ఖాళీ స్థలమును ది. 02-09-2011న పాపసాని బ్రహ్మయ్య వగైరాల వలన విక్రయం పొంది వినుకొండ యస్.ఆర్.ఓ.లో ద.నెం. 8775/2011 గా రిజిష్టరు చేయించుకొని యున్నారు. నా క్లయింట్స్ ది. 20-10-2023న వినుకొండ పట్టణంలో లాయర్స్ స్ట్రీట్ నందు జిరాక్స్ సెంటర్ దగ్గర సదరు ఒరిజినల్ ద.నెం. 8775/2011న పోగొట్టుకొని యున్నారు. చుట్టుప్రక్కల ఎంత వెతికినను సదరు దస్తావేజు దొరికి యుండలేదు. కావున యావన్మందికి తెలియజేయునది ఏమనగా పై ఒరిజినల్ విక్రయ ద.నెం. 8775/2011 ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రసుకి అందజేయ వలసినదిగా కోరడమైనది.

స్థలం : వినుకొండ
తేది : 20-10-2023

యలవర్తి శ్రీనివాసరావు,
న్యాయవాది,
ఇండియన్ బ్యాంక్ వెనుక,
కొత్తపేట, వినుకొండ టౌన్, గుంటూరుజిల్లా.
సెల్ : 9440835056

నోటీసు

మహారాజశ్రీ ఒకటవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు ఒంగోలు

M.V.O.P.No:116/2019

Between
బూసిరెడ్డి @ బుచ్చిరెడ్డి తిరుపతిరెడ్డి తండ్రి నాగిరెడ్డి ..... పిటీషనరు
వర్సెస్
పల్లెపాటి ప్రసాద్ మరియు ఇతరులు ..రెస్పాండెంట్

To
పల్లెపాటి ప్రసాద్, తండ్రి దైవసహాయం
నివాసం : సన్నిధి కళ్యాణ మండపం దగ్గర నరసరావుపేట టౌన్, గుంటూరు జిల్లా డ్రైవర్ అంబులెన్స్ నెంబర్ : **AP26 TB 9497**

పై పిటిషనర్ మీపై మోటారు యాక్సిడెంట్ నష్ట పరిహారం కొరకు పిటిషన్ దాఖలు చేసి మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పేపరు ప్రకటన ద్వారా నీకు నోటీసు జారీ నిమిత్తం వాయిదా తేదీ:19-12-2023కి వేసిఉన్నారు ఆరోజు ఉదయం 10:30 కి పై కోర్టు వారు ఎదుట మీరు స్వయంగా గాని లేదా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు లేని లేనియెడల మీ పరోక్షమందు దావా తీర్మానించబడునని తెలియపరచ డమైనది

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
నాగిశెట్టి మోహన్‌దాస్
మామిడాల మనోహర్
పిటిషనర్ తరపు న్యాయవాదులు
ఒంగోలు

నోటీసు

మహారాజశ్రీ ఒకటవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు ఒంగోలు

M.V.O.P.NO 117/2019

Between
చాగంటి నారాయణమ్మ ..... పిటీషనరు
వర్సెస్
పల్లెపాటి ప్రసాద్ మరియు ఇతరులు .... రెస్పాండెంట్

To
పల్లెపాటి ప్రసాద్, తండ్రి దైవ సహాయం
నివాసం: సన్నిధి కళ్యాణ మండపం దగ్గర నరసరావుపేట టౌన్, గుంటూరు జిల్లా, డ్రైవర్ అంబులెన్స్ నెంబర్ **AP26.TB 9497**

పై పిటిషనర్ మీపై మోటారు యాక్సిడెంట్ నష్ట పరిహారం కొరకు పిటిషన్ దాఖలు చేసి మీకు ఎన్నిసార్లు నోటీసు లు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పేపరు ప్రకటన ద్వారా నీకు నోటీసు జారీ నిమిత్తం వాయిదా తేదీ19-12-2023కి వేసిఉన్నారు ఆ రోజు ఉదయం 10:30 కి పై కోర్టు వారు ఎదుట మీరు స్వయంగా గాని లేదా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు లేని లేనియెడల మీ పరోక్షమందు దావా తీర్మానించబడునని తెలియపరచ డమైనది

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
నాగిశెట్టి మోహన్‌దాస్
మామిడాల మనోహర్
పిటిషనర్ తరపు న్యాయవాదులు
ఒంగోలు

మహారాజశ్రీ నర్సరావుపేట అడిషనల్ సీనియర్ సివిల్‌జడ్జి యిలాకా
ఐ.పి. నెం. 37/2019

బిట్వీన్ :
సూరిశెట్టి రాజేంద్రప్రసాద్ .... పిటీషనర్
వర్సెస్
కాసాగాని జగన్నాథం మరికొంతమంది ... రెస్పాండెంట్స్

1) స్వామి రవికుమార్ తండ్రి శివశంకరరావు, డోర్ నెం. 3-4-36 **(R10)**
2) చిన్నంశెట్టి రోశమ్మ భర్త సుబ్బారావు, డోర్ నెం.2-2-65/3 **(R14)**
3) ముళ్ళపూడి రాజేష్ తండ్రి లింగయ్య **(R16)**
4) మేదం రాము, తండ్రి హనుమంతరావు, షాప్ నెం.138, ఎం.జి. మార్కెట్. **(R22)**
పై అందరూ నర్సరావుపేట పట్టణ వాస్తవ్యులు.
5) బోయపాటి శ్రీనివాసరెడ్డి, తండ్రి బ్రహ్మారెడ్డి, డోర్ ననెం. 4-3, సాయిబాబా గుడి వద్ద, చిరుమామిళ్ళ, నాదెండ్ల మండలం. **(R23)**
6) బంగారెడ్డి తండ్రి కోటిరెడ్డి, సీడ్స్ బిజినెస్, హెచ్.పి. గ్యాస్ గోడౌనన్ వద్ద, పిడుగురాళ్ళ టౌన్. **(R25)**

పై నెంబరు ఐ.పి. నెంబరు 37/2019లో పై కోర్టులో పైన తెలిపిన నెంబర్లు అనగా R10, R14, R16, R22 అను వారలు నర్సరావుపేట వాస్తవ్యులు R23 అనువారు చిరుమామిళ్ళ గ్రామ వాస్తవ్యులు, R25 పిడుగురాళ్ళ వాస్తవ్యులు అనువారలు మరికొందరిపై ఈ వాజ్యం దాఖలు చేయగా, పైన పేర్కొన్న వారికి అనేక పర్యాయములు కోర్టు ద్వారా నోటీసులు పంపినప్పటికీ అవి తీసుకోకుండా కాలయాపన చేయుచున్నారు. శ్రీ కోర్టు వారి ఆదేశానుసారం ఈ ఐ.పి. ది.17-11-2023వ తేదీకి వాయిదా వేసినారు. కనుక ఈ ప్రకటన ద్వారా పై వారందరికీ తెలియపరచడమైనది. కనుక పై వాజ్యం ది.17-11-2023వ తేదీకి వాయిదా వేసినందున ఆ రోజు ఉదయం 10-30 గం.లకు కోర్టు వారి ఎదుట హాజరయి మీకు ఉన్న అభ్యంతరములు తెలియపర్చుకోవలెను.

ఇట్లు
కట్టా నారపరెడ్డి,
అడ్వకేటు, పాతూరు, నర్సరావుపేట.
సెల్ : 94405 77926, 8309188433

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవి నారాయణ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ సిబ్బంది

అవినీతి నిర్మూలనకు యువత విద్యార్థులు ముందడుగు వేయాలి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

స్వాతంత్ర్యానంతరం మనదేశం అనేక రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందిందని, అంతే వేగంగా దేశంలో అవినీతి కూడా పెరిగిందని, డబ్బు సంపాదనకు చెడు మార్గాలను ఎంచుకుంటున్నారని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డీజీఎం ఎ.రమేష్‌రెడ్డి అన్నారు. నరసరావుపేట మండలంలోని జొన్నలగడ్డ గ్రామ పరిధిలో గల తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో 'సే నో టు కరప్షన్ అండ్ కమిట్ ది నేషన్' అంశంపై ఇంజినీరింగ్ మొదటి ఏడాది విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఉత్తమ వ్యాసాలు రాసిన ఐదుగుర్ని ఎంపిక చేసి శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వైవి నారాయణ మాట్లాడుతూ వ్యాస రచన పోటీలు ఆయా అంశాల పట్ల విద్యార్థులను చైతన్యం చేస్తాయన్నారు. భారత పౌరులుగా ఉన్న యువత ముఖ్యంగా విద్యార్థులు అవినీతిని అరికట్టేందుకు ముందడుగు వేయాలని సూచించారు. అవినీతిరహిత భారతదేశం నిర్మాణానికి యువతే మార్గ నిర్దేశం కావాలన్నారు. కార్యక్రమంలో పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డిప్యూటీ మేనేజర్ నాగభూషణరావు, అసిస్టెంట్ మేనేజర్ టిప్పు సుల్తాన్, సైట్ ఇన్‌ఛార్జి మహమ్మద్ ఫయాజ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

ప్రజల ఆరోగ్య రక్షణే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ప్రతి పౌరుని సమగ్ర ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, రాష్ట్ర జలవనరు శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండలంలోని కందులవారిపాలెంలో శుక్రవారం జరిగిన జగనన్న వైద్య శిబిరాన్ని మంత్రి సందర్శించారు. ప్రతి ఇంటికీ వైద్య ఆరోగ్య సిబ్బంది, వాలంటీర్లు నేరుగా వచ్చి రక్త పరీక్ష నిర్వహించడం ద్వారా వారికి ఏ రకాల జబ్బులు ఉన్నాయో తెలుసుకొని వెంటనే వారికి చికిత్సను ప్రారంభిస్తారని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం అధోగతి పాలైందంటూ ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలు చేస్తున్నారని, అయితే ఎలా అధోగతిపాలైందో వివరించడం లేదని అన్నారు. వారి నమ్మొద్దని, వైసిపిని మళ్లీ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఆర్.పురుషోత్తమరావు, రైతు సలహా మండలి సభ్యులు కె.విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ కవిత పాల్గొన్నారు.

వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో ఉన్నా పట్టని పాలకులు

- రాజుపాలెం మండలంలో పాదయాత్ర ప్రారంభంలో పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.లక్ష్మీశ్వరరెడ్డి
- ముప్పాళ్ల మండలంలో కొనసాగిన పోరుయాత్ర

బంతిపూల రైతులతో మాట్లాడుతున్న పాదయాత్ర బృందం

ప్రజాశక్తి - రాజుపాలెం

వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో ఉన్నా పాలకులకు పట్టడం లేదని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.లక్ష్మీశ్వరరెడ్డి విమర్శించారు. మండలంలో మూడ్రోజులపాటు నిర్వహించే సిపిఎం ప్రజా చైతన్య యాత్రను మండల కేంద్రమైన రాజుపాలెంలో ఆయన శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. కీలకమైన వ్యవసాయ రంగాన్ని పాలకులు విస్మరించారని, ఈ కారణంగా ప్రజల ఆర్థిక పరిస్థితి దిగజారుతోందని చెప్పారు. ఈ నేపథ్యంలో సమగ్రాభివృద్ధి కోసం సిపిఎం రూపొందించిన ప్రణాళికను ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ప్రమాదకర రాజకీయ పరిస్థితులున్నాయని, దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెడుతున్న, ప్రజల మధ్య మత విద్వేషాలు రగిలిస్తున్న బిజెపికి రాష్ట్రంలోని టిడిపి, వైసిపి, జనసేన వంతపాడుతున్నాయని మండిపడ్డారు. ఇది ప్రజలకు తీవ్ర అన్యాయం చేయడమేనన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.ఆంజనేయనాయక్ మాట్లాడుతూ ఎండిపోతున్న పైర్లకు కనీసం నీరైనా అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో పెద్ద ఎత్తున కరువు పరిస్థితులు రాబోతున్నాయని, దీన్ని ఎదుర్కోవడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. సత్వరమే ఉపాధి హామీ పనులు కల్పించాలన్నారు. అనంతరం పాదయాత్ర బ్రాహ్మణపల్లి, మొక్కపాడు, రెడ్డిగూడెం, గణపవరం గ్రామాల్లో కొనసాగింది. కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి.శ్రీనివాసరావు, సిహెచ్.రమణ, కృపారాణి, కె.శ్రీలక్ష్మి, బుజ్జి, దుర్గాబాయి, ఎం.శ్రీనివాసరావు, ఎం.బాల పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలో సిపిఎం చేపట్టిన పోరుయాత్ర శుక్రవారం 6వ రోజుకు చేరింది. గోళ్ళపాడు, కుందురువారిపాలెం, తురకపాలెం, కొంకావారిపాలెం గ్రామాల్లో బృందం పర్యటించింది. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, మండల కార్యదర్శి జి.బాలకృష్ణ మాట్లాడుతూ కనీసం రబీకైనా సాగునీరు విడుదల చేయాలని కోరారు. ఇప్పటికే సాగు చేసిన సోయాబీన్, మినుము పైర్లు నీరు లేక ఎండిపోతున్నాయని, బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జి.జాలయ్య, కె.సాంబశివరావు, కె.ప్రభాకర్, ఎన్.సాంబశివరావు, ఐ.లింగయ్య, శ్రీను, వెంకటరెడ్డి, కె.నాగేశ్వరరావు, పి.సైదాఖాన్, నాగమల్లేశ్వరరావు, ఐ.సత్యనారాయణరెడ్డి, టి.బ్రహ్మయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇంటర్ ఫెయిల్, డ్రాపౌట్ విద్యార్థులకు అవకాశం

పరీక్ష ఫీజు గడువు వచ్చే నెల 30 వరకు పెంపు - పల్నాడు జిల్లా ఇంటర్ డిఐఇఒ ఎం.నీలావతిదేవి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఇంటర్మీడియట్ తప్పిన విద్యార్థుల కోసం పరీక్ష ఫీజు చెల్లించే గడువు తేదీని నవంబర్ 30 వరకు ఇంటర్మీడియట్ బోర్డ్ పొడిగించిందని పల్నాడు జిల్లా డిఐఇఒ ఎం.నీలావతిదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పరీక్షల కొరకు ఫీజు గడువు నవంబర్ 30 వరకు పొడిగించిన నేపథ్యంలో విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన, డ్రాపౌట్ అయినవారు జనరల్, ఒకేషనల్ కోర్సు విద్యార్థులు జ్ఞానభూమి పోర్టల్ ద్వారా ఫీజు చెల్లించేలా వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. ఫెయిల్ అయిన విద్యార్థి అడ్మిషన్ పొంది అన్ని పరీక్షలకు హాజరైతే ఎక్కువ మార్కులు వచ్చిన వాటిని పరిగణలోకి తీసుకుంటామని, కంపార్ట్మెంటల్ ఫెయిల్ అని కాకుండా ఒకేసారి ఉత్తీర్ణులయ్యారని సర్టిఫికెట్ జారీ చేస్తామని పేర్కొన్నారు. తిరిగి అడ్మిషన్ పొందిన విద్యార్థులకు జగనన్న అమ్మఒడి, విద్యా కానుక, గోరుముద్ద వంటి వాటికి అర్హులని వివరించారు.

పెయిల్, డ్రాపౌట్ విద్యార్థులు అడ్మిషన్ పొందేందుకు పల్నాడు జిల్లాలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, కళాశాలకు వెళ్లి ఆయా ప్రిన్సిపల్ సమక్షంలోనే సంబంధిత విద్యార్థులకు ఫోన్ చేసి అడ్మిషన్ పొందేలా అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే వినుకొండ, పిడుగురాళ్ల, సత్తెనపల్లిలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామని తెలిపారు. అవసరమైతే కళాశాల సిబ్బంది కూడా విద్యార్థులు ఇంటికి వెళ్లి నచ్చజెబుతారని పేర్కొన్నారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఇంటర్మీడియట్ పాస్/ ఫెయిల్ అయిన విద్యార్థుల కొరకు వివిధ కోర్సులు నిర్వహిస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

డిజి లాకర్లో సర్టిఫికెట్లు...

ఇంటర్ పాస్ అయిన విద్యార్థుల కోసం డిజి లాకర్‌లో ఆన్‌లైన్ సర్టిఫికెట్లు అందుబాటులో ఉన్నాయని ఆమె తెలిపారు. 2014 నుండి 2023 మధ్య చదివిన విద్యార్థులు సర్టిఫికెట్లను డౌన్లోడ్ చేసుకునే సదుపాయం ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. www.digilock-er.govt.in నందు సర్టిఫికెట్ పొందవచ్చన్నారు.

అర్జీలను త్వరగా పరిష్కరించండి

సత్తెనపల్లిలో 'జగనన్నకు చెబుదాం'లో జెసి - ప్రజల నుండి ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

ప్రజల సమస్యలు వింటున్న జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. సత్తెనపల్లి ఆర్డీవో కార్యాలయంలో జగన్ననకు చెబుదాం కార్యక్రమాన్ని జెసి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. కొండమోడు - పేరేచర్ల రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న తమకు త్వరగా పరిహారం చెల్లించాలని సత్తెనపల్లికి చెందిన పలువురు రైతులు విజ్ఞప్తి చేశారు. వారం రోజుల్లో పరిహారం రైతుల ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చారు. జగనన్న కాలనీల్లో ఇల్లు బేస్‌మెంట్ లెవెల్‌కు వచ్చినా ఇంతవరకు బిల్లు రాలేదని సత్తెనపల్లి పట్టణానికి చెందిన పోట్లూరి శ్రవంతి ఫిర్యాదు చేశారు. రెంటపాళ్ల జెడ్పి పాఠశాల సమీపంలో సత్తెనపల్లి - క్రోసూరు రహదారిపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు కోసం ఆకుల గోపి కోరగా అధికారులకు జెసి ఆదేశాలు జారీ చేశారు. రేషన్ సరుకులు సరిగా ఇవ్వటం లేదని సత్తెనపల్లి నాగార్జున నగర్‌కు చెందిన శిఖా కొండలు ఫిర్యాదు చేశారు. నందిగామలో వాగు ముంపు సమస్యను పరిష్కరించాలని రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ అధికారులు ప్రొక్లైన్‌తో పూడిక తీయించాలని ఎంపిడిఒను జెసి ఆదేశించారు. భూములు రీసర్వే నేపథ్యంలో సాగునీటి కాల్వలు అన్యాక్రాంతం కాకుండా ఎన్ఎస్పీ అధికారులకు రీసర్వేలో పాల్గొనాలని ఇఇ మురళీధర్‌కు చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో బిఎల్ఎన్ రాజకుమారి, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ, తహసిల్దార్ సురేష్, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రైతుల సమక్షంలోనే రీసర్వే : జెసి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

భూములు రీ సర్వే పనులపై రైతులతో చర్చించి, వారి సమక్షంలోనే చేయాలని అధికారులకు జెసి స్పష్టం చేశారు. ఈ మేరకు సంబంధిత అధికారులతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అసైన్డ్ భూములు, ఇనాం భూములు, మ్యుటేషన్ కన్వర్షన్, సబ్ డివిజన్స్, ఎఫ్- లైన్ పిటిషన్లు వ్యవసాయ భూములు మార్పులు వంటి విషయాలపై చర్చించి పలు సూచనలు చేశారు.

పేదల కోసం పని చేసిన ధన్యజీవి అమరారెడ్డి

వర్ధంతి సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-తాడేపల్లి :మంగళగిరి తాలూకాలో ముఖ్యంగా తాడేపల్లి ప్రాంతంలో పేదల కోసం పని చేసిన ధన్యజీవి మేకా అమరారెడ్డి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు ఘనంగా నివాళులర్పించారు. మేకా అమరారెడ్డి 42వ వర్ధంతి సభ శుక్రవారం సాయంత్రం స్థానిక నెహ్రూ బొమ్మ సెంటర్‌లో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభకు పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. ముందుగా అమరారెడ్డి

కుంచనపల్లిలో

స్థూపం వద్ద విగ్రహాలకు, సభ వద్ద అమరారెడ్డి చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజల కోసం పని చేసిన వారు ఒకపక్క సమాజంలో ఉంటే, మరోపక్క వ్యక్తిగత లాభార్జన కోసం పని చేసిన వ్యక్తులు ఉన్నారని చెప్పారు. అమరారెడ్డి మొదటి కోవకు చెందిన వ్యక్తి అని కొనియడారు. ఆయన సర్పంచ్‌గా పని చేసిన కాలం నుంచి అభివృద్ధి ఒక క్రమపద్ధతిలో జరిగిందని చెప్పారు. ఈ క్రమంలో అమరారెడ్డి లాంటి నాయకత్వం చాలా అవసరమని పేర్కొన్నారు. చట్టసభల్లో కమ్యూనిస్టులు లేకపోవడం వల్ల ప్రజాసమస్యలు చర్చకు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు తిట్ల పురాణం లంకించుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పాలకులు పుణ్యమాని సాగునీటి కాలువల్లో నీరు పారడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. పంట వేసిన రైతుల పైర్లు ఎండిపోయే పరిస్థితి దాపురించిందని, బ్యాంకు రుణాలు రైతులు సకాలంలో చెల్లించకపోతే జైలు పాలు చేస్తున్న అధికారులు లక్షల కోట్లు తింటున్న వారిని ఎందుకు జైలుకు పంపడంలేదని ప్రశ్నించారు. పార్లమెంట్ సాక్షిగా ప్రత్యేక హోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి, విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ అని చెప్పిన బిజెపి హామీలు ఏమయ్యాయని ప్రజలు నిగ్గదీయాలని చెప్పారు. 350 మంది ప్రాణ త్యాగం చేసిన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని అమ్ముతుంటే వైసిపి, టిడిపి పార్టీలు నోరు ఎందుకు మెదపడంలేదో చెప్పాలని ప్రశ్నించారు. 23 మంది ఎంపిలను గెలిపిస్తే ప్రత్యేక హోదా తెస్తానన్న జగన్ బిజెపి పంచన ఎందుకు చేరాడని ప్రశ్నించారు. సజ్జల రామకృష్ణారెడ్డి కమ్యూనిస్టులు అమ్ముడుపోయారని చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. కమ్యూనిస్టులను కొనడం సజ్జల అబ్బతరం కూడా కాదని చెప్పారు. ఇంతకు బిజెపికి వైసిపి ఎంతకు అమ్ముడుపోయిందో చెప్పాలని డిమాండ్ చేశారు. నాలుగన్నరేళ్లలో ఒక ప్రాజెక్టు అయినా పూర్తి చేశారా అని ప్రశ్నించారు. అభివృద్ధి అంటే అసమానతలు లేని సమాజమని, బటన్ నొక్కితే రాదని చెప్పారు. కరెంటు ఛార్జీల పేరుతో దొంగదెబ్బ తీశారని విమర్శించారు. కొత్త పరిశ్రమలు రావడంలేదు, ఉన్న పరిశ్రమలు మూతబడుతున్నాయని, నిరుద్యోగులు పెరుగుతుంటే ఈ ప్రభుత్వానికి కానరావడంలేదా అని ప్రశ్నించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం సూర్యారావు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.రవి, సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, సిపిఎం సీనియర్ నాయకలు జొన్నా శివశంకకరావు, రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ అభివృద్ధిని చూసి ఓర్వలేక ఈ ప్రాంతంలో సిపిఎం నాయకులను సంఘ విద్రోహ శక్తులు హత్యలు చేశాయని దుయ్యబట్టారు. అమరారెడ్డి అంటే ధైర్యానికి ఐకాన్‌గా నిలిచారన్నారు. అనేక మందికి స్ఫూర్తిని నింపారన్నారు. ఎర్రజెండా భుజాన వేసుకుని పేదల కోసం పని చేశారని తెలిపారు. రాజధానిలో ఇళ్లు ఇస్తామని చెప్పి పాలకులు మోసం చేశారని చెప్పారు. రైతులకు కౌలు జమ కావడంలేదని ఆరోపించారు. వ్యవసాయ కార్మికులకు పింఛను ఐదు వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సభలో మాజీ సర్పంచ్ దొంతిరెడ్డి శ్రీనివాస

హాజరైన ప్రజలు

కుమారి, కె.బాబూరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి -తాడేపల్లి రూరల్ :తాడేపల్లి ప్రాంతంలో సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాడిన దిశాలి కామ్రేడ్ మేక అమరా రెడ్డి అని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం సూర్యారావు అన్నారు. ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి గ్రామంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద అమరజీవి కామ్రేడ్ మేక అమరారెడ్డి 42వ వర్ధంతి కార్యక్రమం సిపిఎం కుంచనపల్లి గ్రామ ఒకటవ శాఖ కార్యదర్శి అమ్మిశెట్టి రంగారావు అధ్యక్షతన జరిగింది. ముందుగా అమరా రెడ్డి చిత్రపటానికి సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం సూర్యారావు పూల మాల వేసి నివాళులర్పించారు. . దేశానికి పెనుముప్పుగా మారిన నరేంద్ర మోడీతో జోడి కట్టే పార్టీలను కూడా వ్యతిరేకించాలని సిపిఎం కుంచనపల్లి గ్రామ రెండవ శాఖా కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కాజా పెద్ద వెంకటేశ్వరరావు, బడుగు వెంకటేశ్వరరావు, అమ్మిశెట్టి రామారావు, అమ్మిశెట్టి సుబ్బారావు, అమ్మిశెట్టి సుధాకర్, చేబ్రోలు సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

93 మందికి కారుణ్య నియామక ఉత్తర్వులు

ప్రజాశక్తి-గుంటూరు :జిల్లా రోడ్డు రవాణా సంస్థలో విధులు నిర్వహిస్తూ మరణించిన వారి కుటుంబ సభ్యులు 93 మందికి వివిధ శాఖలలో నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. జిల్లా కలెక్టర్ యం.వేణుగోపాలరెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, డిఆర్‌ఒ కె.చంద్రశేఖర్‌రావు, డిప్యూటీ కలెక్టర్(ట్రైనీ) కె.స్వాతితో కలిసి శుక్రవారం అభ్యర్థులకు నియామక ఉత్తర్వులను అందచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను 2020 , జనవరి 1న ప్రభుత్వంలో విలీనం చేసిన అనంతరం ఇంత భారీ ఎత్తున కారుణ్య నియమాకాలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అభ్యర్థుల విద్యార్హతలను బట్టి 58 మంది అభ్యర్థులను గ్రామ / వార్డు సచివాలయాల్లో వివిధ హెూదాల్లో నియమించడం జరిగిందన్నారు. అలాగే మిగిలిన 35 మంది అభ్యర్థులను గుంటూరు జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖలలో ఆఫీసు సబార్డినేట్లుగా నియమించడం జరిగిందన్నారు.కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ రీజనల్ మేనేజర్ ఎం.రవికాంత్, జెడ్పీ సిఈఓ జె.మోహన్‌రావు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రకటన బోర్డులకు ఫీజులు చెల్లించాలి

నగర కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి-గుంటూరు

నగరపాలక సంస్థ అనుమతితో నగరంలో ఏర్పాటు చేసిన ప్రతి ప్రకటన బోర్డు నిర్దేశిత రుసుము చెల్లించాలని, ఫీజులు చెల్లించని బోర్డులను తొలగిస్తామని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణ ప్రణాళిక అధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో ఫీజులు చెల్లించని, అనధికార హోర్డింగ్, బోర్డులను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గుంటూరులో నగరపాలక సంస్థ నుండి అనుమతి పొందిన ప్రకటనల హెూర్డింగుల యజమానులు మీడియా డివైజ్ డిస్‌ప్లే ఫీజులు సక్రమంగా చెల్లించాలని, లేకుంటే సదరు బోర్డులను తొలగించి, ఫీజుల వసూళ్లకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.గురు, శుక్రవారాల్లో పట్టణ ప్రణాళిక అధికారులు నగరంలో 70కిపైగా అనధికార హెూర్డింగ్‌లను తొలగించా రన్నారు. నగరంలో వార్డు సచివాలయాల వారీగా ప్లానింగ్ కార్యదర్శులు అనధికార, ఫీజులు చెల్లించని బోర్డులను గుర్తించి, వాటి తొలగింపునకు పట్టణ ప్రణాళిక అధికారుల ద్వారా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని, తమ క్షేత్ర స్థాయి పర్యటనలో ఎక్కడైనా అనధికార బోర్డ్ లు గుర్తిస్తే సంబందిత కార్యదర్శిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రకటనల బోర్డు నిర్వహకులు తప్పనిసరిగా బకాయిలతో పాటుగా ప్రస్తుత ఏడాది డిమాండ్ కూడా చెల్లించాలన్నారు.

సురక్ష క్యాంపును సందర్శించిన మేయర్

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్ర ప్రజల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం వైద్య రంగంలో విప్లవాత్మకమైన చర్యలు తీసుకుందని గుంటూరు నగర మేయర్ కావటి శివనాగ మనోహర్ నాయుడు అన్నారు. శుక్రవారం గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలోని 12వ డివిజన్ చౌత్రా సెంటర్ వద్ద గల గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్‌లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును అధికారులతో కలిసి మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆరోగ్య రంగానికి పెద్దపీట వేస్తున్నారని, ఇంటి వద్దకే సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు ప్రతి ఒక్కరికీ అందేలా ఆరోగ్య సురక్ష క్యాంప్‌లను ఏర్పాటు

క్యాంప్‌లో ప్రజలతో మాట్లాడుతున్న మేయర్

చేశారన్నారు. స్పెషలిస్టు డాక్టర్ల ద్వారా వైద్య పరీక్షలు, పరీక్షల అనంతరం మందులు ఇవ్వటం జరుగుతుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఈ క్యాంపులను వినియోగించుకోవాలని కోరారు.కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఖాజా మొహిద్దీన్ చిష్టి వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 12వ డివిజన్ పరిధిలోని లాలాపేట పాత పోలీస్ స్టేషన్ రోడ్డుకు రూ.20 లక్షలతో సిసి రోడ్డు, సైడు కాల్వల నిర్మాణానికి శుక్రవారం మేయర్ శంకుస్థాపన చేశారు. నిర్మించుటకు మేయర్ శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో అన్ని వార్డులలో వేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని చెప్పారు. ట్రాఫిక్ రద్దీ దృష్యా రోడ్ల విస్తరణ పనులు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఖాజా మొహిద్దీన్ చిష్టి, 20వ డివిజన్ పార్టీ అధ్యక్షులు ఖాజా మొహిద్దీన్, జిఎంసి ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

హైలెవల్ ఛానల్ నిర్మాణ పనులపై

నేడు రౌండ్ టేబుల్

ప్రజాశక్తి-తెనాలి

హైలెవల్ ఛానల్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతూ ఈనెల 21న దుగ్గిరాలలో నిర్వహించే అఖిలపక్ష రైతు సంఘాలు, రాజకీయ నాయకుల రౌండ్ టేబుల్ సమావేశం విజయవంతం చేయాలని పోరాట సాధన కమిటీ కన్వీనర్ ములకా శివసాంబిరెడ్డి కోరారు. మొత్తం మూడు నియోజకవర్గాలు, ఐదు మండలాల పరిధిలో గల హైలెవల్ ఛానల్ నిర్మాణ పనులు 70శాతం పూర్తయ్యాయని, మొత్తం పనులు పూర్తయ్యేందుకు రూ.2 కోట్లు నిధులు మంజూరు చేయాలని, 26వేల ఎకరాలకు సాగునీరు అందించాలని కోరుతూ ఉదయం పది గంటలకు దుగ్గిరాల టర్మరిక్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో సమావేశం జరుగుతుందన్నారు.

ఉండవల్లిలో కొండచిలువ

ప్రజాశక్తి-తాడేపల్లి :ఉండవల్లి సెంటర్‌లోని కోలా సుబ్బారావు రోడ్డులో శుక్రవారం పది అడుగుల కొండచిలువ హల్‌చల్ చేసింది. దీంతో స్థానికులు భయభ్రాంతులకు లోనయ్యారు. ఇళ్ల మధ్య పెద్దఎత్తున ఖాళీ స్థలాలు ఉండటంతో కొండచిలువలు, పాములు రోడ్డు దాటుతూ ఇళ్లలోకి వస్తున్నాయని స్తానికులు ఆందోళన చెందుతున్నారు. ఎంటిఎంసి అధికారులు ఖాళీ స్తలాల్లో జంగిల్ క్లియరన్స్ చేయాలని కోరుతున్నారు.

పాలస్తీనాలో శాంతి కోసం ముస్లిముల ప్రార్థన

ప్రజాశక్తి - తెనాలి

పాలస్తీనాలో యుద్ధం ముగిసి అక్కడ శాంతి నెలకొనాలని కోరుతూ పట్టణంలో ముస్లింలు పెద్ద ఎత్తున ప్రార్థనలు నిర్వహించారు. పట్టణంలోని 21 మసీదులకు చెందిన ముస్లిం, మత పెద్దలు అంతా వహాబ్ రోడ్లోని మదీన మసీదు వద్ద ప్రార్థనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు ఇమామ్లు, మౌజన్లు మాట్లాడుతూ యుద్ధంలో ఆస్తి నష్టంతో పాటు పెద్ద ఎత్తున ప్రాణా నష్టం కూడా జరుగుతున్న నేపథ్యంలో యుద్ధం నిలిచిపోయి శాంతి నెలకొనాలని కోరుతూ ప్రార్థనలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ ప్రపంచ శాంతిని కోరుకోవాలన్నారు. కార్యక్రమంలో ముఫ్తి ఉస్మాన్ సాహెబ్, గోల్డ్ రహీమా, దుబాయ్ బాబు, అన్సారి, మహమ్మద్ కుద్దూస్ పాల్గొన్నారు.

ఇప్పటంలో తారు రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ

అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఎంటిఎంసీ పరిధిలోని ఇప్పటం గ్రామంలో రూ.కోటి 70 లక్షల నిధులతో జరుగుతున్న డివైడర్‌తో కూడిన తారు రోడ్డు పనులను, శుక్రవారం మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి పనులను పరిశీలించారు. ఇప్పటివరకు రూ.80 లక్షల పనులు జరిగినట్లు అధికారులు తెలిపారు. అభివద్ధి పనులు నాణ్యత లోపాలు లేకుండా, పూర్తిస్థాయి పర్యవేక్షణలో జరగాలని అధికారులను ఎమ్మెల్యే ఆళ్ల రామకష్ణారెడ్డి సూచించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి చేనేత విభాగం రాష్ట్ర నాయకులు గంజి చిరంజీవి, వైఎస్ఆర్సిపి తాడేపల్లి మండల అధ్యక్షులు మున్నంగి వివేకానంద రెడ్డి, వైఎస్ఆర్సిపి గ్రామ నాయకులు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

రీసర్వే పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-ముప్పాళ్ల

రైతుల సమక్షంలో భూముల రీ సర్వే పనుల గురించి చర్చించి త్వరితగతిన పూర్తి చేయాలని మండల రెవెన్యూ అధికారులను జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం జెసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న రీసర్వే మూడో విడత పనులను ఆయన పరిశీలించారు. మండల రెవెన్యూ అధికారులతో అసైన్డ్ భూములు, ఇనాం భూములు, మ్యుటేషన్ కన్వర్షన్,సబ్ డివిజన్స్, ఎఫ్ లైన్ పిటిషన్ వ్యవసాయ భూముల మార్పులు వంటి విషయాలపై సుదీర్ఘంగా చర్చించి సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో రికార్డులను పరిశీలించి తగు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ భవానీశంకర్, డిటి లక్ష్మీ ప్రసాద్, పాల్గొన్నారు

దోమల నివారణపై అవగాహన

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఫ్రైడే డ్రై డేలో భాగంగా పట్టణంలోని వెంకటాచారి నగర్‌లో జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ శుక్రవారం పర్యటించారు. దోమల నివారణకు తీసుకోవాల్సి జాగ్రత్తలను, జ్వరాలు రాకుండా చేపట్టాల్సిన చర్యలపై ఇంటింటికీ వెళ్లి సిబ్బందితో ప్రచారం చేయించారు. నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని, దోమతెరలు వాడాలని చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ వెంకటేశ్వరరావు, చిలకలూరిపేట సబ్‌యూనిట్ అధికారి నారాయణ, భుపతిరావు, ఎస్.వి. చలమారెడ్డి, ఎన్.శివయ్య,కె.దిలీప్, కొటేశ్వరరావు ఎస్.కె.జిలాని పాల్గొన్నారు.

గృహ నిర్మాణంలో ప్రభుత్వం విఫలం : కాంగ్రెస్

ప్రజాశక్తి - చిలకలూరిపేట

నియోజకవర్గ పరిధిలోని నాదెండ్ల, పరిసర గ్రామాల్లో గృహ నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.రాధాకృష్ణ విమర్శించారు. ఈ మేరకు స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి విశాఖ పట్నంలోని రుషికొండలో రూ.వందల కోట్లతో నివాసం గృహం నిర్మించడంలో చూపిన శ్రద్ధ పేదల ఇళ్ల నిర్మాణంపై పెట్టడం లేదని అన్నారు. చిలకలూరిపేట రూరల్ మండలంలో జగనన్న కాలనీల్లో 850 మంది, వ్యక్తిగత గృహాల నిర్మాణం కోసం 480 మంది దరఖాస్తు చేసుకుని ఎదురు చూస్తున్నారని, నాదెండ్ల మండలంలో మరో 3 వేల మందిదీ ఇదే పరిస్థితని చెప్పారు. వీటికి సత్వరమే అనుమతులిచ్చి నిర్మాణం చేపట్టాలని కోరారు.

విద్యార్థులకు పుస్తకాలు, పలకలు పంపిణీ

ప్రజాశక్తి - విజయపురిసౌత్

దసరా నవరాత్రులను పురస్కరించుకుని స్థానిక సిటైపు లోని కనకదుర్గ వెంకటేశ్వర ఆలయంలో శుక్రవారం కాంట్రాక్టర్ లక్ష్మయ్య సహకారంతో 100 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలు,పెన్నులు, పలకలు హెచ్ ఎం వెంకట నారాయణ చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా హెచ్ ఎం వెంకట నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఊరే మార్క్, చింతమల్ల చెన్నయ్య,గొంతిన రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడు లో వర్షం

ప్రజాశక్తి-పెదకూరపాడు

పెదకూరపాడు లో శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. ఈ వర్షం మిరప పంటకు ఊపిరి అందిస్తుంది. ఇప్పటికే కొద్దిమంది బావులున్నవారు మిరపకు నీరందించారు. ఇటీవల తాగునీటి పేరుతో కాలువలకు వదిలారు. కాలువల వెంట ఉన్న మిరప రైతులు ఇంజన్ల ద్వారా నీటిని పెట్టుకున్నారు. గాలితో కూడిన వర్షం కురుస్తూ ఉండటంతో మిరప మొక్కలు దెబ్బ తినే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

మెప్మా ఆధ్వర్యంలో అర్బన్ మార్కెట్ ప్రారంభం

ప్రజాశక్తి - మాచర్ల

మెప్మా ఆధ్వర్యంల స్థానిక కూరగాయల మార్కెట్ దగ్గర ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్ ను గమాచర్ల మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన్న ఏసోబు, కమిషనర్ ఇవి రమణబాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్, కమిషనర్ మాట్లాడుతూ అర్బన్ మార్కెట్‌ను ఏర్పాటు చేసి డ్వాక్రా మహిళలు తయారు చేసిన వస్తువులను తక్కువ రేటుకు విక్రయించడం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో మెప్మా సిఎంఎం ఎం. సుబ్బా రావు, సిఒలు రాజశేఖర్, అంజలి, ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయండి

ప్రజాశక్తి-ఈపూరు

కౌలు రైతులకు బ్యాంక్ అధికారులు పంట రుణాలను మంజూరు చేసి ఆర్థిక సహకారం అందించాలని ఏఓ ఆర్ రామారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యా లయం నందు బ్యాంక్ అధికారులతో కౌలు రైతులు-రుణ మంజూరుపై అవగాహన సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రతి రైతు భరోసా కేంద్ర పరిధిలో కౌలుకు సాగు చేసే రైతులకు కౌలు రైతు కార్డులు మంజూరు చేశామన్నారు. వ్యవసాయానికి పెట్టుబడి సాయంగా పంట రుణాలు మంజూరు చేయాలన్నారు. ఎంపీడీవో ఏవి రంగనాయకులు మాట్లాడుతూ అర్హతల పై ఆంక్షలు విధించకుండా కౌలు రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన కౌలు కార్డులు ఆధారంగా రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని బ్యాంక్ అధికారులను కోరారు. కార్యక్రమంలో సీజీజీ బ్యాంక్ మేనేజర్ డి రాజేష్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫీల్డ్ ఆఫీసర్ హనిమిరెడ్డి,అంగలూరు, ఈపూరు పిఎసిఎస్‌ల కార్యదర్శులు,జీడీసీసీ బ్యాంక్ సూపర్‌వైజర్, గ్రామ వ్యవసాయ, ఉద్యాన శాఖ సహాయకులు పాల్గొన్నారు.

యుగకవి గుంటూరు శేషేంద్రశర్మ

ప్రజాశక్తి-గుంటూరు

తెలుగు సాహిత్యానికి విమర్శకుడిగా గుంటూరు శేషేంద్రశర్మ పరిచిన దారి విశ్వజనీనమైందని, తెలుగు భాషా సాహిత్య వనంలో ఆరు దశాబ్దాలపాటు సాహితీ సేవ చేసిన యుగకవి ఆయన అని సాహితీవేత్తలు, కవులు, కళాకారులు కొనియాడారు. గుంటూరు లోని అవగాహన ఆధ్వర్యంలో శుక్రవారం జరి గిన జయంతి కార్యక్రమంలో శేషేంద్రశర్మకు పలువురు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రచయిత్రి, జర్నలిస్టు పింగళి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ శేషేంద్ర శర్మ కవిగా, విమర్శకుడిగా, బహుభాషా కోవిదుడుగా, గొప్ప కవితా వారసత్వానికి గట్టి పునాదులు వేశారని అన్నారు. ఆధునిక సంప్రదాయంరీతుల్లో సరిసమానంగా అనేకమైన మధురమైన కవితలు అల్లారని ప్రశంసించారు. ఆయన రచనల్లో ప్రధానాంశంగా ప్రకృతి, సామాన్య ప్రజల స్థితి గతులను కళ్లకు గట్టినట్టుగా కన్పించేవని అన్నారు. 'ప్రకృతి అందాలు నా కవితలకు స్ఫూర్తి, ప్రజల కష్టాలు, నా కవితలకు స్ఫూర్తి' అని శేషేంద్రశర్మ పలు సందర్భాల్లో చెప్పేవారని గుర్తుచేశారు.

సాహితీరంగ విశ్లేషకులు మాట్లాడుతూ శేషేంద్ర శర్మ రచనల్లో నా దేశం- నా ప్రజలు, మండే సూర్యుడు, గొరిల్లా, ఆధునిక భారతం, కవిసేన మేనిఫెస్టో వంటివి అత్యంత ప్రధానమైనవని అన్నారు. 1994లో రాసిన 'కాలరేఖ'కు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించిందని, 2004లో నా దేశం- నా ప్రజలు రచన నోబుల్ సాహిత్య పుర స్కారానికి నామినేట్ అయిందని గుర్తుచేశారు. గాయకులు ఎం.ఘనశ్యామాచార్యులు మాట్లా డుతూ శేషేంద్రశర్మ గొప్ప ఆధునిక భావాలు పుణికిపుచ్చుకున్న భావకవి అని కొనియాడారు. అనంతరం విశ్లేషకులు సాయిబాబు, పద్యకవి పల్నాటి సుబ్బారావు తదితరులు ప్రసగించారు.

పారిశుధ్యకార్మికులకు రెండు నెలలు వేతనాలు చెల్లింపు

ప్రజాశక్తి - అమరావతి

మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో పని చేసే 9 పారిశుధ్య కార్మికులకు రెండు నెలలు వేతనాలు చెల్లించినట్లు కార్మికులు తెలిపారు.18వ తేదీ బుధవారం ప్రజాశక్తిలో వెలువడిన పారిశుధ్య కార్మికులకు ఐదు నెలలుగా అందని వేతనాలు కథనానికి కాంట్రాక్టులు స్పందించి రెండు నెలలు వేతనాలు చెల్లించారని కార్మికులు ఆనంద వ్యక్తం చేశారు. దసరాకి పస్తులు ఉంటారేమోనని భయందోళన చెందిన కార్మికులు ప్రజల పక్షాన నిలిచే ప్రజాశక్తి కి తమ బాధలు వ్యక్తపరచడం ద్వారా నేడు రెండు నెలలు వేతనాలు చెల్లింపులు జరిగాయని కార్మికులు తెలిపారు.

మాచర్లలో ఎగ్జిబిషన్ ప్రారంభం

ప్రజాశక్తి - మాచర్ల

పట్టణంలోని గుంటూరు రోడ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల వైసిపి యువజన విభాగం జోనల్ ఇంచార్జి, వైసిపి రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఆనందాన్ని ఆహ్లాదాన్ని అందించే ఎగ్జిబిషన్‌ను మాచర్లలో ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన్న ఏసోబు, మాజీ చైర్మన్ తురక కిషోర్, వార్డు కౌన్సిలర్లు రామిశెట్టి వెంకటేశ్వర్లు, షేక్ మస్తాన్, గట్ల అరుణ కోటిరెడ్డి, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తనయులు పిన్నెల్లి గౌతమ్ రెడ్డి, ఎగ్జిబిషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

పౌరాణిక నటుడు బెజగం రవికుమార్‌కు విజయదశమి పురస్కారం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

సత్తెనపల్లికి చెందిన పౌరాణిక రంగస్థల నటులు బెజగం రవికుమార్ కు సాహితి కళాసేవా సమితి సాంస్కృతిక సేవా సంస్థ కరీంనగర్ వారిచే విజయదశమి పురస్కారం లభించింది. ఈ మేరకు బుధవారం హైదరా బాదు, ఆబిడ్స్ లోని బొగ్గుల కుంట సంజీవయ్య భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆంధ్ర, తెలంగాణా రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో రంగస్థలం, కళలు, మిమిక్రీ, సమాజ సేవ, ఉపాధ్యాయ మొదలైన రంగాల్లో ప్రావీణ్యం గడించిన దాదాపు 100 మందికి ఈ విజయ దశమి పురస్కారాలు ప్రదానం చేశారు. అనివార్య కారణాల వల్ల రవికుమార్ ఈ కార్యక్రమానికి హాజరుకాకపోవడంతో, ఈ పురస్కారాన్ని ఉపాధ్యాయుడు అక్కపల్లి యాదగిరి స్వీకరించి ఆయనకు అందజేశారు. ఈ సందర్భముగా రవికుమార్‌ని సత్తెనపల్లి లోని వివిధ కళా సంస్థల అధినేతలు, కార్యదర్శులు, అభినందించారు.

పాటిబండ్లలో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలోని పాటి బండ్లలో మాజీ శాసనసభ్యులు కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 'బాబు తో నేను' కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు రమేష్, టిడిపి నాయ కులు బి. రాంగోపాలరావు, ఎం.సత్యం, పాటిబండ్ల నాయకులు బాల్రెడ్డి, సుభాని పాల్గొన్నారు.

మెయిన్ బజార్ ను విస్తరించండి

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి పట్టణ జనాభా లక్షకుపైగానే ఉంటుంది. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వేలాదిమంది తమ పనుల నిమిత్తం నిత్యం మంగళగిరికి వస్తుంటారు. దీంతో, మెయిన్‌బజార్‌లో రద్దీ ఉండటంతో ప్రజలు, వాహన దారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రాజధాని ప్రాంతం కూడా కావడంతో రాష్ట్రం నలు మూలల నుంచి కూడా మంగళగిరికి వచ్చే వారి సంఖ్య పెరిగింది. దక్షిణ భారతదేశం లోనే ప్రసిద్ధి చెందిన క్షేత్రం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానం. బ్రహ్మోత్సవాల సమయంలో, తరథోత్సవం, ముక్కోటి ఏకాదశి వంటి పర్వదినాల్లో ఇక్కడ సుమారు వచ్చే పర్యాటకు ల సంఖ్య లక్షకు పైగానే ఉం టుంది. మంగళగిరి చేనేతకు రాష్ట్ర వ్యాప్తంగా పేరు ఉండటంతో తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల నుంచి వస్త్రాల కొనుగోలుకు వచ్చే వారి సంఖ్య బాగానే ఉంటుంది. ఏవిధంగా చూసినా మంగళగిరి పట్టణానికి నిత్యం వచ్చే ప్రజల సంఖ్య పెరిగిపోయింది. కనుక, మెయిన్ బజార్‌ను విస్తరించడంపై అధి కారులు, ప్రజాప్రతినిధులు దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

ప్రజారోగ్యానికి ప్రథమ శత్రువు దోమ

ప్రజాశక్తి-తెనాలి

జాతీయ కీటక వాహన జనిత వ్యాధుల నియంత్రణ కార్యక్రమంలో భాగంగా దోమకాటు ద్వారా వ్యాపించే వ్యాధుల పట్ల తెనాలి పట్టణ పరిధిలో నిర్వహించిన ఫ్రైడే డ్రై డే అవగాహన ర్యాలీని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దోమలు ప్రజారోగ్యానికి ప్రథమ శత్రువులని, జనావాసాల మధ్య నీటినిల్వలు లేకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా మలేరియా అధికారి టి.మురళీకృష్ణ సుబ్బరాయణం మాట్లాడుతూ దోమల ద్వారా మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికున్ గునియా, మెదడువాపు వ్యాధులు వస్తాయన్నారు. ఫ్రైడే ని డ్రై డేగా పాటించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌ఛార్జి చైర్మన్ ఎం.హరి ప్రసాద్, మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి రాజు నాయక్, సిహెచ్ ప్రభాకర్ రెడ్డి, విస్తరణాధికారి ఎ.బాలచంద్రమౌళి, ఉమాకాంత్, సూపర్‌వైజర్ డి.శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు, నవీద్, ఎఎన్ఎమ్ దెబోర పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో 'పొలంబడి'

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

మండలంలోని ఉప్పరపాలెంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గ్రామంలో ఎంపిక చేసిన రైతులు, ఆర్‌బికె సిబ్బంది హాజరయ్యారు. భాగస్వామ్య కార్యాచరణ పరిశోధన,పొలం పరిసరాల విశ్లేషణ కార్యక్రమాల గురించి వివరంగా చర్చించారు. బృందవిన్యాసంలో భాగంగా పొడవైన గొలుసు తయారు చేసి బృందసభ్యులు చూపించారు. ప్రస్తుతం పొలంలో పరిస్థితులు, పరిష్కార మార్గాల గురించి చర్చించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖాధికారి డి.వెంకట్రామయ్య పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు

మండలంలోని వడ్డమానులో పొలం బడి, పంటల పరిశీలన జరిగింది. పత్తి,మిర్చి పంటలను డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ కో ఆర్డినేటర్,(డి ఆర్ సి) పి.రామాంజనేయులు, డిఎటిసి సైంటిస్ట్ శ్రీలత వాణి, ఏవో రాజ వంశీ పరిశీలించారు. పంటలపై తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

31లోపు కొత్త ఓట్ల వివరాలు చేర్చాలి

ప్రజాశక్తి - చేబ్రోలు

మండల బూత్ లెవెల్ అధికారుల సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు.సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇఆర్ఒ వై.హరిహరనాథ్ మాట్లాడుతూ బిఎల్ఒ తమ పరిధిలో కొత్తగా నమోదు చేసిన, పెండింగ్ లో ఉన్న ఓటర్ల వివరాలను ఈ నెల 31 లోపు ఇఆర్ఒ లాగిన్‌లో ఎంటర్ చేయడం పూర్తి చేయాలని, ఫామ్-6 వివరాలు ఖచ్చితత్వంతో ఉం డాలని, ఇందులో రాసిన దరఖాస్తుదారిని వివరాలతో పాటు సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని అన్నారు.

ఓటరు అంగీ కారంతోనే తప్ప ఏ ఒక్కరి ఓటు తీసే హక్కు గాని, చేర్చే హక్కు గాని ఎవరికీ లేదని స్పష్టం చేశారు. ఎన్నికల సమ యం సమీపిస్తున్నందున


మాట్లాడుతున్న ఇఆర్ఒ వై.హరిహరనాథ్

బిఎల్ఒసి అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని, అప్‌డేట్‌గా ఉండా లని సూచిం చారు. కార్యక్రమంలో తహశీల్దార్ కెవి గోపాలకృష్ణ, ఇఒపిఆర్ అండ్ ఆర్‌డి జి.శ్రీనివాసరావు, రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ ఎస్ కె అజీజ్, డిప్యూటీ తహశీల్దార్ వై.ప్రణతి ఇందిర క్రాంతిపథం ఎపిఎం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎరువులు అధికధరలకు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి - తుళ్లూరు

ఎరువు దుకాణాలను తనిఖీ చేస్తున్న ఎఒ శ్రీ రంజని

మండలంలోని వడ్డమాను,పెదపరిమిలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఎఒ శ్రీరంజని తనిఖీ చేశారు. దుకాణాల లైసెన్స్, నిబంధనలకు అనుగుణంగా అమ్మకాలు జరుగు తున్నాయా, లేదా అనే విషయాలపై ఆరా తీశారు. రైతులు అధీకృత డీలర్ల వద్దనే ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేయాలని సూచించారు. నిబంధనలు పాటించని దుకాణాదారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణంలో ఎరువులు, పురుగుమందులు వ్యాపారం నిర్వహిస్తున్న దుకాణాలను స్థానిక మండల వ్యవసాయ శాఖాధికారి డేగల వెంకట్రామయ్య, పొన్నూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఆర్.రామకోటీశ్వరి కలిసి శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. అనుమతులు లేని పురుగుమందులను విక్రయించినా, ఎరువులు అధిక ధరలకు అమ్మినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యూరియా గురించి రైతులు ఎవరు ఇబ్బంది పడాల్సిన పనిలేదని చెప్పారు. రైతు భరోసా కేంద్రాలు, పిఎసిఎస్ సొసైటీలలో కూడా సరిపడా యూరియాను నిల్వ చేసినట్లు చెప్పారు. రైతులు దీనిని గమనించి యూరియా కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎరువు దుకాణాలను తనిఖీ చేస్తున్న ఎడిఎ రామకోటీశ్వరి

చిత్రలేఖనం ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పుస్తకపఠనం అలవర్చుకోండి

ప్రజాశక్తి-పెదనందిపాడు

విద్యార్థులు దసరా సెలవుల్లో గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని, పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని ఎస్‌టియు నాయకులు గేరా మోహనరావు సూచించారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, గ్రంథాలయ పుస్తక పఠనం వలన విషయ పరిజ్ఞానం పెరుగుతుందని, విద్యార్థులందరూ పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని, గ్రంథాలయ పుస్తక పఠనం వలన మేధస్సు పెరుగుతుందని, ప్రపంచ జ్ఞానం కలుగుతుందని పేర్కొన్నారు. అక్టోబర్ 14వ తేదీ నుండి 24వ తేదీ వరకు దసరా సెలవుల్లో ప్రతిరోజు ఉదయం 8 గంటల నుండి 12 గంటల వరకు విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు గంథాలయ నిర్వహకురాలు పి.సుభాషిని తెలిపారు. శుక్రవారం చిత్ర లేఖనం, పెయిం టింగ్ లలో పోటీలను, బాలబాలికలకు క్యారమ్స్ పోటీలను నిర్వహించారు. విద్యా ర్థులతో కథలు చెప్పించడం, కథలు వినడం, కథలు చదవడం, పుస్తక సమీక్ష, చిత్రలేఖనం తదితర కార్యక్రమాలను నిర్వహించినట్లు ఆమె చెప్పారు.

రోగుల సేవలో సత్యసాయి సమితి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు సేవ చేసేందుకు సత్య సాయి సేవా సమితి ముందుకు రావడం అభినందనీయమని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. శుక్రవారం శ్రీ సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సత్య సాయి ఉచిత సమాచార సహాయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రిలో రోగులకు సేవ చేసేందుకు ముందుకు వచ్చారని చెప్పారు. సంస్థ కార్యకర్తలు ప్రభుత్వ ఆసుపత్రి లో కూడా రోగులకు సేవా చేసేందుకు పెద్ద మనసుతో ముందుకు వచ్చినందుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆస్పత్రికి వచ్చే ఔట్ పెషెంట్స్ కోసం అదనంగా 11 కౌంటర్లు ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. కౌంటర్ల వద్దకు వచ్చే రోగులకు వారి సహాయకులకు ఎక్కడకు వెళ్లాలో తెలియక కొంతమంది ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా సత్యసాయి సేవ సమితి ముందుకు వచ్చినందుకు కృతజ్ఞ తలు తెలిపారు. సమితి కన్వీనర్ ఎ.రామకృష్ణారావు, కె.సాయి బాబు, డాక్టర్ పి యల్ నరసింహమూర్తి, వై రోశరావు, శ్రీధర్, యన్ వి హనుమంత రావు, శిరీష, అపర్ణ, సివిల్ సర్జన్ ఆంఎంఒ డాక్టర్ సతీష్ కుమార్, డిప్యూటీ సూపరింటెం డెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, నర్సింగ్ సూపరింటెం డెంట్ ఆశా సజని పాల్గొన్నారు.

విద్యతో ఉన్నత శిఖరాలు

ప్రజాశక్తి-పెదకాకాని రూరల్

విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని పెదకాకాని ఎస్ఐ వెంకటాద్రి తెలిపారు. శుక్రవారం గుడ్ షెఫర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ చైల్డ్ ప్రొటెక్షన్ ఇంచార్జ్ సిస్టర్ లత ఆధ్వర్యంలో మండల పరిధిలోని వెనిగండ్ల, స్వర్ణపురి కాలనీ, పెదకాకాని గ్రామాల్లోని చిల్డ్రన్స్ పార్లమెంటరీ లీడర్లను పెదకాకాని పోలీస్‌స్టేషన్, జిల్లా కోర్టును సందర్శించారు. ఎస్ఐ మాట్లాడుతూ బాలికలు వారి హక్కులను గురించి తెలుసుకోవాలని చెప్పారు.

మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యం

ప్రజాశక్తి - మంగళగిరి

మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం తెనాలి రోడ్ లో నూతనంగా నిర్మించిన ఫిష్ ఆంధ్ర వెండింగ్ యూనిట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కొక్క యూనిట్‌ను 2 లక్షల రూపాయల చొప్పున 17 యూనిట్లను ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంలో నిర్మించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, రాష్ట్ర చేనేత విభాగం వైసీపీ అధ్యక్షులు గంజి చిరంజీవి, కార్పొరేషన్ కమిషనర్ యు.శారదాదేవి పాల్గొన్నారు.

7న 'చలో హైదరాబాద్' కరకత్రాల పంపిణీ

ప్రజాశక్తి - చేబ్రోలు:

వచ్చే శీతాకాల పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీల రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 7న 'చలో హైదరాబాద్' విశ్వరూప మహా పాదయాత్రకు ఎమ్మార్పీఎస్ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యలో ఈ పాదయాత్రకు మద్దతుగా పొన్నూరు ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి కార్యకర్తలు తలపెట్టిన పాదయాత్ర శుక్రవారం చీలిపాలెం, పాతరెడ్డిపాలెం, చెరు వుల పాలెం, కొత్తరెడ్డిపాలెం మీదుగా నారా కోడూరు, వేజండ్ల వరకు కొనసాగింది. ఈ సందర్భంగా పొన్నూరు నియోజకవర్గ ఎంఆర్పిఎస్ ఎంఎస్పి ఇన్‌ఛార్జి మురికిపూడి హృదయరాజు మాట్లాడుతూ మహా పాదయాత్ర కర పత్రాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. వర్గీకరణ బిల్లును వచ్చే శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో ప్రవేశపెట్టాలని, చట్టబద్ధత కల్పించాలని అందుకు రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. పాదయాత్రలో ఎ.బాబు వెంకటేష్ మాదిగ, చేబ్రోలు మండల ఇన్‌ఛార్జి డి.బాబు మాదిగ, యు.ఆనంద్ మాదిగ, ఎస్.మేరీ బాబు మాదిగ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు అందజేస్తున్న సిలిండర్లు, స్టౌ లు మంజూరు పత్రాలు

'ఉజ్వల-2'ను వినియోగించుకోండి

ప్రజాశక్తి-దుగ్గిరాల

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారందరూ ఉజ్వల-2 పథకాన్ని వినియోగించుకోవాలని స్థానిక ఇన్సాన్ గ్యాస్ ఏజెన్సీస్ అధినేత గద్దె శ్రీనివాస్ కోరారు. శుక్రవారం వారి కార్యాలయంలో ఈ పథకం లబ్ధిదారులకు సిలిండర్లు, స్టౌ లు పంపిణీ ప్రారంభించారు. 300 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోగా 150 మందికి మంజూరైనట్లు తెలిపారు. ఉజ్వల-2 పథకం కింద లబ్ధిదారులకు ప్రభుత్వం డిపాజిట్ ఉచితంగా ఇస్తుందని, మిగిలిన వారు రుణ సౌకర్యం ద్వారా పొందవచ్చునని, ఈ రుణం లబ్ధిదారులకు ఇచ్చే సబ్సిడీ ద్వారా రికవరీ అవుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌పిసి జిల్లా సేల్స్ అధికారి, ఉజ్వల నోడల్ అధికారి జె.జగదీష్ బాబు, ఎం.గాంధీ, కె.జోగేంద్ర ప్రసాద్, చుండూరు ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

స్పందనకు అధికారులు తప్పక హాజరుకావాలి

జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతి నెల మూడవ శుక్రవారం జరిగే స్పందన కార్యక్రమానికి జిల్లా అధికారు లందరు తప్పక హాజరు కావాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, డీఆర్ఓ కె.చంద్రశేఖరరావు, డిప్యూటీ కలెక్టర్(ట్రైనీ) కె.స్వాతితో కలిసి ప్రభుత్వ, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నుండి 19 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి మాసం మూడవ శుక్రవారం జరిగే ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జరిగే స్పందన కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ తప్పక హాజరు కావాలని ఆదేశించారు.ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని తెలిపారు. అంతకు ముందు గత మాసం వరకు అందిన ఫిర్యాదుల పరిష్కారం , పెండింగ్ ఫిర్యాదులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జెసి రాజకుమారి సమీక్షించారు. వివిధ ప్రభుత్వ శాఖలలో పని చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించి పరిష్కరించాల్సిన 51 దరఖాస్తులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించిన 26 ఫిర్యాదులను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గ్రీష్మ, తహసిన్లను అభినందిస్తున్న సుబ్రహ్మణ్యం, డి.ఎస్.పి జనార్ధన్ రావు తదితరులు

తెనాలికి వన్నె తెచ్చిన నృత్యకారిణులు

ప్రజాశక్తి - తెనాలి

అతి చిన్నవయసులో కూచిపూడి నృత్య ప్రదర్శనలు చేస్తూ ఖ్యాతి గడించిన చిన్నారులు కళా రంగంలో తెనాలి ప్రాధాన్యతకు చిహ్నంగా నిలిచారని డిఎస్‌పి జనార్ధనరావు కితాబిచ్చారు. పట్టణానికి చెందిన చిన్నారులు గ్రీష్మ, తహసీన్ ఇటీవల తమిళనాడు, కర్ణాటక గవర్నర్ల వద్ద కూచిపూడి నృత్య ప్రదర్శన చేసి ప్రశంసలందుకున్న నేపథ్యంలో కుమార్ పంప్స్ ఆధ్వర్యంలో శుక్రవారం వారిని సత్కరించారు. కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో స్థానిక సుల్తానాబాద్ లోని కుమార్ పంప్స్ సమావేశ హాలులో జరిగిన కార్యక్రమంలో డిఎస్పి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. దర్శకుడు దిలీప్ రాజా అధ్యక్షతన జరిగిన సభలో తొలుత గ్రీష్మ, తహసీన్ నృత్య ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ జస్వంత్ రావు మాట్లాడుతూ బాల నర్తకిలను గుర్తించి ప్రోత్సహిస్తున్న కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రహ్మణ్యం అభినందనీయులన్నారు. కొత్త సుబ్రమణ్యం మాట్లాడుతూ చిన్నారులు నృత్య కళాకారులుగా మరింతగా ఎదిగి, తెనాలి కళా కీర్తిని నలుదిశలా చాటాలన్నారు. ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్య వాణి చిన్నారులను అభినందించారు. అనంతరం గ్రీష్మ శ్రీ, షేక్ తహసిన్లను సత్కరించారు. ఇరువురు బాలికలకు, నాట్య గురువు నిర్మలా రమేష్ కు ఒక్కొక్కరికి రూ.6116 లు నగదు బహుమతిని కుమార్ పంప్స్ యాజమాన్యం అందజేసింది. కార్యక్రమంలో కొత్త వసుంధర, కొత్త కష్ణ కుమార్, నిర్మలా రమేష్, కృష్ణా రెడ్డి , మిలటరీ ప్రసాద్ , బెల్లంకొండ వెంకట్, అరుణ కుమారి, ఆలియా, కొత్త సాయి ప్రదీప్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గంతో ఎన్నికల అధికారులు డాక్టర్ బి.సాంబిరెడ్డి, డాక్టర్ వి.శేషగిరిరావు తదితరులు

ఐఎంఎ నూతన కార్యవర్గం ఏకగ్రీవం

ప్రజాశక్తి - తెనాలి : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారులు డాక్టర్ వి శేషగిరిరావు, డాక్టర్ భీమవరపు సాంబిరెడ్డి, డాక్టర్ ఎం వి సత్యనారాయణ తెలిపారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షులుగా డాక్టర్ జె విజయలక్ష్మి, కార్యదర్శిగా డాక్టర్ వి పవని ప్రియాంక, ఉపాధ్యక్షులుగా డాక్టర్ కె అనిల్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా డాక్టర్ జి మధు ప్రభాకర్ బాబు, కోశాధికారిగా డాక్టర్ కె శ్యాం ప్రసాద్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఐఎంఏ సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ అసోసియేషన్ బలోపేతానికి, సభ్యుల సంక్షేమానికి తమ వంతు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఐఎంఎ సభ్యులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలు ఇప్పించండి

అధికారులకు జెసి ఆదేశాలు

పెసర, మినుము సాగుపై అవగాహన

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ రాజకుమారి

జిల్లాలో పంటలు సాగు చేస్తున్న కౌలు రైతులందరికీ బ్యాంకుల ద్వారా పంట రుణాలు మంజూరు అయ్యేలా బ్యాంకర్లను సమన్వయం చేసుకుంటూ వ్యవసాయశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ జి రాజకుమారి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జరిగిన జిల్లా స్థాయి వ్యవసాయ సలహామండలి సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ జి రాజకుమారి పాల్గొన్నారు. సమావేశంలో ఏజెండాకు సంబంధించిన అంశాలపై జరిగిన చర్చ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ జి రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో సిసిఆర్‌సి కార్డులు పొందిన కౌలు రైతులకు నిర్దేశించిన మేరకు పంట రుణాలు బ్యాంకర్లు మంజూరు చేసేలా లీడ్ బ్యాంకు మేనేజరు బ్యాంకర్లతో నిరంతరం పర్యవేక్షించాలన్నారు. కౌలు రైతులకు పంట రుణాల మంజూరు పై ప్రత్యేకంగా బ్యాంకర్లతో డీసీసీ సమావేశం నిర్వహించి సమీక్షించటం జరుగుతుందన్నారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రబీలో మినుము, పెసర వంటి ఆరుతడి పంటలు సాగు చేసేలా ఇప్పటి నుంచే వ్యవసాయశాఖ క్షేత్రస్థాయి ఉద్యోగులు రైతులకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో కృష్ణా వెస్ట్రన్ డెల్టా పరిధిలో సాగు చేసున్న పంటలకు లభ్యత ఉన్న సాగు నీటిని చివరి భూములకు సక్రమంగా అందించేలా ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులు నిరంతర పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో మంజూరు చేసిన డ్రిప్, స్ప్రింకర్లు యూనిట్లు త్వరితగతిన రైతుల పోలాల్లో ఏర్పాటు చేసేలా సంబంధిత ఎజెన్సీలతో ఏపీఎంఐపీ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు మరింత ఎక్కువుగా ఎరువులు విక్రయాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పాడి రైతులను ప్రోత్సహించేందుకు జగనన్న పాలవెల్లువ పథకం ద్వారా పాలిచ్చే గేదేల కొనుగోలుకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు అయ్యేలా పశుసంవర్ధక శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నాబార్డు అగ్రికల్చర్ మార్కెటింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ ద్వారా ఏర్పాటుకు అవకాశం ఉన్న పరిశ్రమలపై ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవగాహన కల్పించాలని, దీనిపై సంబంధిత శాఖల అధికారులతో కలసి అవగాహన మేళా ఏర్పాటు చేయాలని నాబార్డు డీడీఎంకు సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్న వెంకటేశ్వర్లు, ఏపీఎంఐపీ ప్రాజెక్టు మేనేజరు వజ్రశ్రీ, జిల్లా ఉద్యానశాఖ అధికారి రవీందర్, ఇరిగేషన్ ఎస్ఈ ఉమామహేశ్వరరావు, జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజరు జి లక్ష్మీ, ఏపీ సీడ్స్ జిల్లా మేనేజరు సుబ్బయ్య, ఆత్మ డిడి రామాంజనేయులు, పశు సంవర్ధక శాఖ డిడి కెవీవీ సత్యనారాయణ, ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం రాజకుమారి, నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి శరత్, లీడ్ బ్యాంకు మేనేజరు మహిపాల్ రెడ్డి, లాం శాస్త్రవేత్త రజని, వ్యవసాయ సలహామండలి సభ్యులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్థానిక పట్టాభిపురం మౌలానా అబుల్ కలాం అజాద్ షాదిఖానాలో స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అధికారులు శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ మేళాను ప్రారంభించారు. జాబ్ మేళా కార్యక్రమం విజయవంతంగా పూర్తి అయ్యిందని చదువుకొని ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగుల కోసం ప్రభుత్వం జాబ్ మేళా నిర్వహిస్తుందని ఊహించిన దానికంటే ఎక్కువగా మంది ఈ జాబ్ మేళాలో యువతి, యువకులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారని ఎమ్మెల్యే తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా పాలిటెక్నిక్, డిగ్రీ, బీ.టెక్ ఆపై చదివిన 620 మంది పాల్గొన్నారన్నారు. 25 కంపెనీలు స్వచ్ఛందంగా 70 విభాగాలలో ఉద్యోగాలు ఇవ్వడానికి ముందుకు వచాయని తెలిపారు. ఇంటర్వ్యూలలో 300మంది ఉద్యోగాలు సాధించారని తెలిపారు. జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, డివిజన్ కార్పొరేటర్లు ఉడుముల లక్ష్మి- శ్రీనివాస రెడ్డి, పడాల సుబ్బారెడ్డి, అడకా పద్మావతి, సాదు ఉమా మహేశ్వరి రాజేష్, అందుగుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఐదు ఇసుక రీచ్‌లకు అనుమతులు

గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల రెడ్డి

జిల్లాలో కొత్తగా ఐదు ఇసుక రీచ్‌లకు అనుమతి ఇచ్చినట్లు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈమేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారితో కలిసి పాల్గొన్నారు. కమిటీలో ప్రతిపాదించిన గుండిమెడ, మున్నంగి, బొమ్మవానిపాలెం(రెండు రీచ్‌లు), వీరుపాలెం రీచ్‌లకు అనుమతులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇసుక రీచ్‌ల అనుమతులకు నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం సంబంధిత శాఖలతో మైనింగ్ శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి ప్రతిపాదనలు పక్కగా సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.సమావేశంలో డిప్యూటీ కలెక్టర్ కె స్వాతి, కమిటీ కన్వీనర్, జిల్లా మైనింగ్ శాఖ డిప్యూటీ డైరక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరరావు, సభ్యులు డీటీసీ ఎస్.కె.కరీమ్, జిల్లా భూగర్భ జలవనరుల శాఖ డీప్యూటీ డైరక్టర్ వందనం, డీఎస్పీ ఎస్.విజయశేఖర్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ ఎం నారాయణ, డీఎల్పీవో ఎస్.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

విలువిద్య పోటీల్లో ఆరుషి రెడ్డికి 3వ స్థానం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మారుతి ఆరుషి రెడ్డిని సత్కరిస్తున్న డాక్టర్ కంజుల జగన్మోహన్ రెడ్డి

సౌత్ ఇండియా సి .బి. ఎస్ .సి జోనల్ స్థాయి విలువిద్య పోటీలలో నరసరావుపేట పట్టణానికి చెందిన ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ రామలింగారెడ్డి మనవడు మాలపాటి మారుతి ఆరుషి రెడ్డిని రెడ్ క్రాస్ పల్నాడు జిల్లా చైర్మన్ కొండవీడు ఈ.ఎన్.టి హాస్పిటల్ అధినేత డాక్టర్ కంజుల జగన్మోహన్ రెడ్డి శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ సౌత్ ఇండియా సి. బి .ఎస్ .సి జోనల్ స్థాయిలో, అండర్ - 14 విభాగంలో విలువిద్య పోటీలలో 170 మంది పోటీ చేయగా మాలపాటి మారుతి ఆరుషి రెడ్డి 3వ ర్యాంక్ సాధించడం గర్వించదగ్గ విషయమన్నారు. త్వరలో డెహ్రాడూన్‌లో జరిగే జాతీయ విలువిద్య పోటీలలో విజయం సాధించి నరసరావుపేట, మరియు ఆంధ్ర రాష్ట్ర ఖ్యాతిని జాతీయ స్థాయిలో నిలబెట్టాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. చిన్నతనంలోనే అతనిలో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించిన తల్లిదండ్రులను కుటుంబ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పి.వి.ఎం. శరత్ బాబు, కోశాధికారి మురళీకృష్ణ, మేనేజింగ్ కమిటీ సభ్యులు కె.ఎం.ఎన్.వి శ్రీనివాస గుప్తా, మాజీ కౌన్సిలర్ మస్తాన్ వలీ, విజేత ఎలక్ట్రానిక్స్ అధినేత నరసింహారావు పాల్గొన్నారు.